



తాడికొండ: తెగిపోయిన తాడికొండ - కంతేరు రోడ్డు

యంత్రాంగం పొలంబాట



కొల్లూరు: చిలుమూరులో పసుపు పైరులో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

- సరికొత్తగా పొలం పిలుస్తోంది
- అన్నదాతలకు అండగా 14 శాఖలు
- ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన
- రైతుల సమక్షంలో కోలాహలంగా కార్యక్రమం
- వారంలో రెండు రోజులు.. రోజుకు రెండు గ్రామాల్లో..
- సాగు వ్యయం తగ్గించి.. పంటల దిగుబడి పెంచడమే లక్ష్యం
- నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గాలికొదిలేసిన వ్యవసాయాన్ని గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అస్తవ్యస్తంగా మారిన వ్యవసాయ రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పొలం పిలుస్తోంది పేరుతో వినూత్నంగా సరికొత్తగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆధునిక సేద్యాన్ని అందిపుచ్చుకోలేక పోవడం, దిగుబడులు సాధించకపోవడం, పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోవడంతో నష్టపోతున్న రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వ యంత్రాంగాన్ని పొలంబాట పట్టించింది. రైతులకు సాగులో ఎదురవుతున్న ఆటంకాలు, ఇబ్బందులను అధిగమించేలా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టింది. సాగులో పెట్టుబడులు తగ్గించి.. పంటల దిగుబడి పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. వ్యవసాయ, ఉద్యాన శాఖతో పాటు 14 శాఖల అధికారులు అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మత్స్య, సేంద్రియ, మార్కెటింగ్ శాఖ అధికారులు పొలంబాట పట్టారు. భూసార లోపాలను గుర్తించలేక సూక్ష్మపోషకాల లోపంతో దిగుబడులు పడిపోతున్న క్రమంలో రైతులను చైతన్యవంతం చేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అంతటా రైతుల సమక్షంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి.

బాపట్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నానాటికి సేద్యం భారంగా మారి అప్పుల ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతలు కొందరైతే బలవన్మరణాలకు పాల్పడుతున్న వారు మరి కొందరు. ఈ పరిస్థితి నుంచి రైతులను గట్టెక్కించాలంటే వారిని ఆధునిక వ్యవసాయం వైపు మళ్లించడంతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా వారిలో అవగాహన కల్పించాలి. మార్కెట్‌లో ఇబ్బడిముబ్బడిగా వస్తున్న విత్తనాలు, పురుగుమందుల నాణ్యత మీద అన్నదాతలకు చైతన్యం కల్పిస్తే నకిలీల బారిన పడి మోసపోకుండా ఉంటారు. ఇతర ప్రాంతాల్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించిన పంటల సాగుపై రైతులకు వివరించి వారిని ఆ దిశగా మళ్లించాలి. వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేసే వివిధ పథకాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రయోజనం దక్కేలా చూడాలి. ఇవన్నీ జరిగితే చాలావరకు రైతులు అప్పుల ఊబి నుంచి గట్టెక్కడమే కాకుండా లాభసాటి వ్యవసాయం వైపు అడుగులేస్తారు. ఈ దిశగా ప్రభుత్వం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలి. అయితే వైసీపీ హయాంలో ఐదేళ్ల మిగిలిన రంగాల మాదిరిగానే వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం గాలికివదిలేసింది. దీంతో రైతులు అటు ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఇటు ప్రభుత్వ అశ్రద్ధతో తీవ్రంగా నష్టపోయారు. ఐదేళ్ల నిర్లక్ష్యానికి స్వస్తి చెబుతూ రైతుల మేలు కోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యవసాయరంగంపై దృష్టి సారించింది. రైతులకు లబ్ధి చేకూరేలా.. వారిని చైతన్యవంతం చేసేలా సరికొత్తగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రూపొందించింది. మంగళవారం నుంచి పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తోంది. ఇకపై ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో వారంలో రెండు రోజులు.. రెండు గ్రామాల్లో క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయిలో పొలాల్లోని రైతుల మధ్యే కార్యక్రమం నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పొలంబాట పట్టే అధికారులు చేలల్లో రైతులకు సరికొత్త పాఠాలకు అధికారులు శ్రీకారం చుట్టారు. పంట దిగుబడి తగ్గడానికి కారణాలు, భూమిలో పోషకాల లోపాన్ని గుర్తించి అన్నదాతలకు అవగాహన కల్పించడం, బిందు, తుంపర సేద్యం వల్ల ఒనగూరి ప్రయోజనాలు, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియం వైపు అడుగులేసేలా అన్నదాతలను ప్రోత్సహించడం, వివిధ పథకాల రాయితీలతో పాటు రైతుల సందేహాలను నివృత్తి చేసి సేద్యాన్ని లాభదాయకంగా మార్చడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుంది. వ్యవసాయ అనుబంధంగా ఉన్న 14 శాఖల అధికారుల సేవలను రైతులు ఈ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వినియోగించుకోవచ్చు. మండలాల ప్రత్యేక అధికారులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు మొదలుకుని సిబ్బంది వరకు వారంలో రెండు రోజులు తప్పనిసరిగా పొలాల్లోనే ఉండి రైతులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలనే ఆదేశాలను కూటమి ప్రభుత్వం జారీ చేసింది. పంట దిగుబడి తగ్గడానికి కారణాలు విశ్లేషించడం, సూక్ష్మ పోషకాల లోపాలు గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేస్తున్నారు. భూఆరోగ్య కార్డుల పంపిణీ, బిందు, తుంపర సేద్యం పథకం అమలు, రాయితీపై సూక్ష్మ, బిందు పరికరాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ సీజన్ ముగిసే వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమ నిర్వహణ ఖర్చుల కోసం బాపట్ల జిల్లాలో దాదాపు రూ.55 లక్షల నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే కోటి రూపాయల పైనే నిధులను ప్రభుత్వం వెచ్చించనుంది. ఒక్కరోజు సమావేశ నిర్వహణకు వ్యవసాయ శాఖకు రెండు వేల రూపాయల వరకు ఖర్చు కానుంది.



యడ్లపాడు: కొండవీడులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో సరిత

గత ఐదేళ్లు మొక్కుబడిగా..

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం పక్కాగా అమలయ్యేది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పొలంబడి పేరిట చేపట్టిన కార్యక్రమం మొక్కుబడి తంతుగా మిగిలింది తప్పితే రైతులకు దాని వల్ల ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. మండలానికి రెండు చోట్ల పొలంబడి అంటూ కార్యక్రమాలను ఓ ప్రహసనంగా జరిపించారు తప్పితే క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడేలా నిర్వహించ లేకపోయారు. దీంతో గత ఐదేళ్లలో మారుతున్న సేద్యంతో పాటు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించే వారే కరువయ్యారు. పైగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.2 కోట్ల వరకు పొలంబడి తాలూకా బిల్లులను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచింది.

పొలంబడి రూ.2 కోట్ల పెండింగ్

గత వైసీపీ ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహించిన పొలంబడి కార్యక్రమం తాలూక బకాయలు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ రూ.2 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. ఒక్క బాపట్ల జిల్లాలోనే ఈ మొత్తం రూ.75 లక్షల వరకు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రైతుల సంక్షేమం కోసమే గతంలో ఎన్నడూ లేని విధంగా పొలంబడి నిర్వహిస్తున్నట్లు గతంలో వైసీపీ పాలకులు ఊదరగొట్టేవారు. ఈ కార్యక్రమానికి ఖర్చు అయ్యే స్వల్ప నిధుల కోసం నెలల తరబడి బకాయిలు ఉంచడంలోనే అన్నదాతలపైన గత ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆరంభంలో ప్రతి ఆర్‌బీకే పరిధిలో పొలంబడి నిర్వహించాలని గత ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అది కాస్తా చివరి రెండేళ్లలో మండలానికి రెండు చోట్లకే పరిమితమైంది. అది కూడా తూతూ మంత్రంగా జరిపించేవారు తప్పితే ఎక్కడా కూడా రైతుల భాగస్వామ్యం కనబడేది కాదు. ఈ క్రమంలో ప్రస్తుతం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి సరికొత్త హంగులద్ది రైతులకు పూర్తిస్థాయిలో మేలు చేకూరేలా చేపట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రహదారులు ఛిద్రం దుర్భరం

- వర్షాలు, వరదలతో ధ్వంసం
- గుంతలుగా మారిన రోడ్లపై నరకం
- ప్రభుత్వానికి సవాలుగా రోడ్ల మరమ్మతులు
- తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణకు ఆర్‌అండ్‌బీ అంచనాలు

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూలిగే నక్కపై తాటిపండు చందంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో రహదారుల పరిస్థితి మారింది. వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి బలై అంతంతమాత్రంగా ఉన్న రోడ్లను ఈ నెలలో కురిసిన వర్షాలు మరింతగా దెబ్బతీశాయి. సెప్టెంబరు తొలివారంలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు తోడు ఇటీవల కురిసిన వర్షాలు రోడ్లను ఘోరంగా దెబ్బతీశాయి. తెగిపోయిన రోడ్లు, ధ్వంసమైన రహదారుల కారణంగా పలు ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఆర్‌అండ్‌బీ శాఖ తాజాగా రూపొందించిన నివేదిక ప్రకారం గుంటూరు, పల్నాడు డివిజన్లలో దాదాపు 400 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమైనట్లు తేలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల అభివృద్ధి, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టినప్పటికీ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు సవాలు విసురుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో రోడ్లు దాదాపుగా దెబ్బతినిపోయాయి. ఈ పరిస్థితిని గమనించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించింది. అయితే ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలు సవాలు విసురుతున్నాయి. తక్షణ అవసరాల రీత్యా చేపట్టిన తాత్కాలిక మరమ్మతులు కూడా ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్నాయి. దీంతో శాశ్వత ప్రాతిపదికన రోడ్లు వేయాల్సిన అవసరం మరింత పెరిగింది. దీనిపై కూటమి ప్రభుత్వం, ఆర్‌అండ్‌బీ అధికార యంత్రాంగం దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● గుంటూరు జిల్లాలో 198 కి.మీ. రోడ్లు ధ్వంసం

రహదారులు భవనాల శాఖ గుంటూరు డివిజన్ పరిధిలో 198.11 కిలో మీటర్ల మేర రహదారులు ధ్వంసమయ్యాయి. వీటిలో రాష్ట్ర రహదారులు 81.272 కిలో మీటర్ల మేర దెబ్బతినగా, రూ.20.39 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. వాటిని తాత్కాలికంగా పునరుద్ధరించడానికి రూ.1.27 కోట్లు, శాశ్వతంగా పునరుద్ధరించడానికి రూ.19.12 కోట్లు అవసరమని భావిస్తున్నారు. దెబ్బతిన్న వాటిలో మూడు రోడ్లు అంచులు తెగిపోయాయి. నాలుగు రోడ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. తెనాలి- నారాకోడూరు రోడ్డు ఆరున్నర కిలో మీటర్ల మేర దెబ్బతినగా, తెనాలి- మంగళగిరి రోడ్డు 10.8 కిలో మీటర్ల మేర, గుంటూరు చీరాల రోడ్డు 11.1 కి.మీ మేర, గుంటూరు- హనుమాన్‌పాలెం రోడ్డు 16.57 కి.మీ. మేర, తెనాలి- మంగళగిరి రోడ్డు రెండు చోట్ల 7.3 కి.మీ మేర దెబ్బతింది. మేజర్ రహదారుల్లో దుగ్గిరాల- కొల్లిపర రోడ్డు, మున్నంగి రోడ్డు, దుగ్గిరాల రోడ్డు, దుగ్గిరాల- పెదపాలెం రోడ్డు, దుగ్గిరాల- నంబూరు రోడ్డు, పెదవడ్లపూడి బ్రిడ్జి నుంచి పెదపాలెం రోడ్డు, జీఎం రోడ్డు నుంచి బ్యాంక్ కెనాల్ రోడ్డు, పెదపాలెం నుంచి రేవేంద్రపాడు వంతెన రోడ్డు, నిడుబ్రోలు- ప్యాపర్రు రోడ్డు, పొన్నూరు- పాండ్రపాడు రోడ్డు, ప్రతిపాడు- యడ్లపాడు రోడ్డు, జేకేసీ కాలేజీ- పొన్నెకల్లు రోడ్డు, ఎన్‌హెచ్- 5 నుంచి బీ కెనాల్ రోడ్డు, జీఎంసీ నుంచి నిడమర్రు రోడ్డు, ఉప్పలపాడు- కాజ రోడ్డు, రేటూరు- అప్పికట్ల రోడ్డు, నారాకోడూరు అనంతవరప్పాడు రోడ్డు, గుంటూరు- వట్టిచెరుకూరు రోడ్డు, చేబ్రోలు- వడ్లమూడి- వీఎన్‌పాలెం రోడ్లు సహా మొత్తం 27 రోడ్లు దెబ్బతిన్నాయని సమాచారం.

● పల్నాడు జిల్లాలో.. 207 కి.మీ రోడ్లు ధ్వంసం

పల్నాడు జిల్లాలో 207.03 కిలో మీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. వాటిలో రాష్ట్ర రహదారులు 93.18 కి.మీ మేర దెబ్బతినగా రూ.31.63 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లా మేజర్ రహదారులు 113.85 కి.మీ మేర దెబ్బతినగా, నష్టం రూ.74.97 కోట్లుగా అంచనా వేశారు. తాత్కాలిక మరమ్మతులకి రూ.5.24 కోట్లు అవసరం కాగా, శాశ్వత మరమ్మతులకు రూ.111 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 14 చోట్ల రోడ్లు అంచులు తెగి కొట్టుకుపోయాయి. రెండు చోట్ల రోడ్ల మధ్య గుంతలు పడ్డాయి. 26 చోట్ల రోడ్ల మీద నీరు ప్రవహించి దెబ్బతిన్నాయి. రాష్ట్ర రహదారుల్లో నరసరావుపేట- సత్తెనపల్లి, ఫిరంగిపురం, కొచ్చెర్ల- ఏల్చూరు రోడ్డు, కొండ్రముట్ల- బండ్లమోతు దుర్గి రోడ్డు, వినుకొండ- ముప్పరాజువారిపాలెం రోడ్డు, వినుకొండ- కొప్పరపాడు రోడ్డు, పొదిలి వినుకొండ రోడ్డు, మాచర్ల- విజయపురిసౌత్ రోడ్డు, సత్తెనపల్లి మాదిపాడు రోడ్డు, సత్తెనపల్లి- అమరావతి రోడ్డు, జిల్లా రహదారుల్లో మాచర్ల- కారంపూడి- వినుకొండ, చింతలచెరువు రింగు రోడ్డు, వినుకొండ- గుంట్లపల్లి- రావులపురం, శివాపురం- దొండపాడు, నకరికల్లు- గురజాల, దుర్గి- వెల్దుర్తి, పిడుగురాళ్ల- గోవిందపురం, పిల్లుట్ల- రుక్మిణీపురం, పొల్యాయిగేటు- సత్రశాల, మాచర్ల- గుంటూరు రోడ్డులోని మంచికల్లు రోడ్డు, క్రోసూరు- బల్లమూరు, తుళ్లూరు, అమరావతి, సత్తెనపల్లి బయ్యవరం, రాజుపాలెం- అమరావతి, ఊటుకూరు- అచ్చంపేట, జూపూడి- తుళ్లూరు, చిలకలూరిపేట- సందెపూడి, సాతులూరు, మురికిపూడి, వీపీఎస్- వేలూరు రోడ్డు, నరసరావుపేట- చేజర్ల, రావిపూడి- సంతగుడిపూడి రోడ్లు సహా జిల్లాలో 50 రోడ్లు ధ్వంసమయ్యాయి.



గుంటూరు నగరంలోని రెడ్డిపాలెం రోడ్డు దుస్థితి



ఈపూరు: అగ్నిగుండాలలో రోడ్డుపైనే మురుగునీరు

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో చేరువకావాలి

- గురజాల పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ శ్రీనివాసరావు



పొందుగల చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గురజాలటౌన్, దాచేపల్లి, సెప్టెంబరు 27: ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం గురజాల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. చోరీ కేసుల్లో సొత్తు రికవరీపై దృష్టి పెట్టాలన్నారు. విచారణలో ఉన్న కేసుల పురోగతి తెలుసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్లను పెంచి గస్తీ ముమ్మరం చేయాలన్నారు. అక్రమ మద్యం, ఇసుక, గంజాయి రవాణా, నిల్వలపై దృష్టి పెట్టాలన్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్‌ల మోసాలు, ఫోక్సో నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తొలుత పోలీస్‌స్టేషన్లోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ భాస్కర్, ఎస్‌ఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు పనితీరు కీలకం

అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు పనితీరు చాలా కీలకమని ఎస్పీ తెలిపారు. దాచేపల్లి మండలం పొందుగల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీచేసి సిబ్బంది పనితీరును పరిశీలించి, దిశ నిర్దేశం చేశారు. తెలంగాణ నుంచి పల్నాడు జిల్లాలోకి మద్యం అక్రమంగా రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, నాటుసారా, మద్యం నిషేధిత అక్రమ రవాణాలను అరికట్టాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని తెలిపారు. చెక్‌పోస్టు నుంచి రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట సీఐ గుత్తి వెంకట్రావు, ఎస్‌ఐ శివనాగరాజు, తదితరులున్నారు.

అమృత్.. ఆపసోపాలు

- తొమ్మిదేళ్లుగా పనుల సాగదీత
- నిధుల కొరతతో ఎక్కడి పనులక్కడే
- చిలకలూరిపేట, నరసరావుపేట వాసులు ఇక్కట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ పట్టణాల్లోని ప్రజలకు తాగునీరు, పారిశుధ్య మెరుగుదలతో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ప్రవేశపెట్టగా జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేటవాసులు ఆ భాగ్యానికి నోచుకోవడంలేదు. 15 నుంచి 18 నెలలు అంటే ఒకటిన్నర సంవత్సరంలో పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా నిధుల కొరత, చిత్తశుద్ధి లేమితో తొమ్మిదేళ్లుగా పనులు సాగుతూ ఉన్నాయి. అమృత్ పథకం పనులు పూర్తికి అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. నిధుల కొరతతో పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో అమృత్ పథకం లక్ష్యం నీరుగారిపోయింది. నరసరావుపేట, చిలకలూరిపేట, పురపాలక సంఘాల్లో అమృత్‌లో చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. చిలకలూరిపేట, నరసరావుపేట పట్టణాలకు అమృత్ కింద 2015, 2016 ఆర్థిక సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో ఆయా మున్సిపాలిటీలలో రక్షిత మంచి నీటి పథకాల విస్తరణ, మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వ హయాంలో అయినా పనులు పూర్తి చేస్తే ప్రజలకు తాగునీరు, మురుగునీటి సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. కూటమి అధికారం చేపట్టడంతో పనులు పూర్తి అవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

పైపులైన్‌తో సరి..

నరసరావుపేట మున్సిపాల్టీలో రూ.18.11 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టగా రూ.5.08 కోట్లతో పైపులైన్ నిర్మాణం పూర్తయింది. కుళాయిలు, నీటి సరఫరా పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంకు పనులు సాగదీస్తునే ఉన్నారు. ఎప్పటికి పనులు పూర్తి చేస్తారో అధికారులకే తెలియాలి.

అప్పు చేసినా సాగని పనులు..

చిలకలూరిపేట మున్సిపాల్టీలో రూ.149.92 కోట్లతో పనులు చేపట్టారు. అయితే నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయి. రూ.7.70 కోట్లతో ఇంటింటికి 4975 కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యం నెరవేరలేదు. పంపింగ్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు, తదితర తాగునీటి పథకం పనులు పూర్తి చేయలేకపోయారు. సాగర్ ప్రధాన కాల్వ నుంచి పట్టణానికి నీటిని సరఫరా చేసేందుకు రూ.132.11 కోట్లతో పైపులైన్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పనులు 37 శాతమే పూర్తయ్యాయి. తాగునీటి విస్తరణ పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. పైపులైన్ నిర్మాణం పూర్తికి రూ.61 కోట్లు విడుదల చేస్తానని స్వయంగా అప్పటి సీఎం జగన్ ప్రకటించారు. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా రూ.10.10 కోట్లతో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఓగేరు వాగు సమీపంలో చేపట్టిన ఎస్‌టీపీ పనులు కూడా నిలిచిపోయాయి. మున్సిపల్ వాటా నిధులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఏపీయూఎఫ్ ఐడీసీ సంస్థ వద్ద మున్సిపల్ ఆస్తులు తనఖా పెట్టి రూ.43 కోట్లు రుణం తీసుకున్నారు. అయినా పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం తాండవిస్తున్నదన్న విమర్శలున్నాయి.



అమృత్ పథకం కింద నరసరావుపేటలో మూడేళ్లుగా నిర్మాణంలో ఉన్న రక్షిత మంచి నీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్

బీబీనగర్ డబ్లింగ్‌కు భూసేకరణ

- 47.62 ఎకరాల సేకరణకు రైల్వే నిర్ణయం
- రైల్వే, రెవెన్యూ, సర్వే శాఖల అధికారుల సన్నాహాలు
- ఏడాది వ్యవధిలో అవార్డులు జారీ చేయడమే లక్ష్యంగా కసరత్తు

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టుల్లో అత్యంత కీలకమైన గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్‌కు సంబంధించి భూసేకరణ ప్రక్రియ జోరందుకున్నది. ఇప్పటికే సర్వే నెంబర్ల వారీగా భూసేకరణకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ (పీఎన్)ని జారీ చేసిన రెవెన్యూ శాఖ కొద్ది రోజుల్లోనే జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలని నిర్ణయించింది. రైల్వే, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు ఒక బృందాలుగా ఏర్పడి ఈ సంయుక్త పరిశీలనని చేపట్టనున్నాయి. రైల్వే చట్టం ప్రకారం భూసేకరణ జరగనుండటంతో పెద్దగా సమస్యలు ఉత్పన్నం కాకపోవచ్చని భావిస్తున్నాయి. ఇందుకోసం అవసరమైన కసరత్తు గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో వేగవంతంగా జరుగుతున్నది. గుంటూరు, పల్నాడు జిల్లాలకు రైలు కనెక్టివిటీని మరింతగా పెంచే ప్రాజెక్టుగా గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ మారనున్నది. ఈ క్రమంలో జీసీటీ కింద డబ్లింగ్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని రైల్వేశాఖ నిర్ణయించి ఇటీవలే బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించింది. ఈ ప్రాజెక్టు కోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేపట్టాల్సి ఉన్నది. గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు పశ్చిమ, తాడికొండ, మేడికొండూరు మండలాల్లో 47.62 ఎకరాల భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్లను జారీ చేశారు. భూసేకరణలో భాగంగా సాధ్యమైనంత త్వరగా జాయింట్ ఇన్‌స్పెక్షన్ పూర్తి చేసి పెగ్ మార్కింగ్, గ్రామసభలు, ముసాయిదా జాబితా, ఫైనల్ నోటిఫికేషన్లను జారీ చేయాల్సి ఉన్నది. నష్టపరిహారం చెల్లింపు విషయంపై రైతులతో సంప్రదింపులు కూడా జరపాల్సి ఉన్నది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలన్ని ఏడాది వ్యవధిలో పూర్తి చేసి అవార్డులు పాస్ చేయడంతో పాటు భూమిని రైల్వేకు స్వాధీనం చేయనున్నట్లు గుంటూరు ఆర్డీవో శ్రీకర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం ● 28 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com

నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు



కొరటాల శివ

'మా అందరి నాలుగేళ్ల కష్టమే 'దేవర' చిత్రం. ఆదరిస్తున్న ప్రేక్షకులకు, ఇస్తున్న రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లకు ధన్యవాదాలు. నందమూరి అభిమానులకు మేమెప్పుడూ రుణపడి ఉంటాం. 'దేవర' కోసం దర్శకుడు కొరటాల శివ చాలా కష్టపడ్డారు. ఎన్టీఆర్ ఇరగదీశాడు. తను వన్ మ్యాన్ షో చేశాడు. నాకెంతో గర్వంగా ఉంది' అన్నారు కల్యాణ్‌రామ్. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంతో ఆయన నిర్మించిన 'దేవర' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెలబ్రేషన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆ తర్వాత కొరటాల శివ మాట్లాడుతూ 'ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మూడేళ్ల కష్టం 'దేవర'. నా కెరీర్‌లోనే బెస్ట్ ఫిల్మ్ అంటున్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్, సుధాకర్‌లకు ధన్యవాదాలు. చివరి నిముషం వరకూ అందరూ కష్టపడ్డారు. అందుకే ఇంత పెద్ద విజయం దక్కింది' అన్నారు. 'దేవర' చిత్రాన్ని తెలంగాణలో విడుదల చేసిన దిల్ రాజు మాట్లాడుతూ ' స్టార్ హీరో సినిమా రిలీజ్ అనగానే పండగ వాతావరణం ఉంటుంది. నేను రాత్రి సినిమా చూశా. ఈ చిత్రం ఇంత పెద్ద విజయం సాధించిందంటే కారణం ఎన్టీఆరే. వన్ మ్యాన్ షోతో సినిమాను నిలబెట్టారు' అన్నారు.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న మంచు మోహన్‌బాబు, విష్ణు

'ఢిల్లీలో మీ స్నేహితులు...' అనకుండా ఉండాల్సింది'

● ప్రకాశ్‌రాజ్ ఉద్దేశం నాకు అర్థమైంది - ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్




'ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియా ద్వారా వెలిబుచ్చిన అభిప్రాయాన్ని నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని పవన్ కల్యాణ్ వెల్లడించారు తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో పెట్టిన ఓ పోస్ట్‌లో పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి 'మీ వ్యాఖ్యలు మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా ఉన్నాయి... కేంద్రంలోని మీ స్నేహితులకు ధన్యవాదాలు' అని ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేయడం దుమారం రేపింది. దీనిపై తాజా ఇంటర్వ్యూలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దోషులకు శిక్ష పడాలనే ఉద్దేశంతో నేను స్పందిస్తే... 'దిల్లీలో మీ స్నేహితులు...' అంటూ కామెంట్ చేయాల్సిన అవసరం ప్రకాశ్‌రాజ్‌కు లేదు. ఆయన పోస్ట్‌ను నేను తప్పుగా అర్థం చేసుకోలేదు. ఆయన ఉద్దేశం నాకు సరిగానే అర్థమైంది' అని చెప్పారు. 'ప్రకాశ్‌రాజ్ నాకు మంచి మిత్రుడు. రాజకీయంగా దారులు వేరైనా మా మధ్యన ఒకరంటే ఒకరికి గౌరవం ఉంది. ఆయనతో కలసి పనిచేయడం ఇష్టం' అని కూడా పవన్ చెప్పారు.

మనకేం కావాలి.... ప్రకాశ్‌రాజ్ తాజా ట్వీట్

తిరుపతి లడ్డూ కల్తీ వివాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకున్న ప్రకాశ్‌రాజ్ శుక్రవారం మరోసారి సోషల్ మీడియా వేదికగా విమర్శలకు దిగారు. అందులో 'మనకేం కావాలి... ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి.. తద్వారా రాజకీయ లబ్ధిని సాధించడమా? లేక ప్రజల మనోభావాలు గాయపడకుండా...పరిపాలనా సంబంధమైన... అవసరమైన తీవ్రమైన చర్యలతో... సున్నితంగా సమస్యను పరిష్కరించుకోవడమా?' అంటూ పవన్ కల్యాణ్ పేరును ప్రస్తావించకుండా ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేశారు.

మూల్యం చెల్లించుకోకతప్పదు - ఖుష్బూ

లడ్డూ వివాదంపై నటి ఖుష్బూ స్పందించారు. తిరుమల లడ్డూను కల్తీ చేసినవాళ్లు ఎవరైనా మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. 'ఆ వేంకటేశ్వర స్వామి అంతా చూస్తున్నాడు. లడ్డూను కల్తీ చేయడం అంటే కోట్లాది మంది ప్రజల విశ్వాసాలు, మనోభావాలు దెబ్బతీయడమే. అని ఖుష్బూ చెప్పారు.



వంద రోజుల్లో విజయాలెన్నో...

ఆరు హిట్స్.. అనేక ఫ్లాపులతో చిత్రసీమ ప్రథమార్థాన్ని ముగించింది. అతి కీలకమైన ద్వితీయార్థంలో ఇప్పటి వరకు వచ్చిన సినిమాలలో.. భారీ చిత్రాలు అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాయి. ఇప్పటికే మూడు నెలలు ముగిశాయి. ఇక ఉన్నది మూడు నెలలే. ఈ మూడు నెలల్లో అరడజను భారీ చిత్రాలు క్యూలో ఉండటం విశేషం. వాటిలో అలరించేవి ఎన్ని.. చరిత్ర సృష్టించేవి ఏవి.. అంచనాలను తారుమారు చేసేవి ఎన్నో తెలియాలంటే ఏడాదిలోని ఆఖరి వారం వరకూ వేచి చూడాల్సిందే.

పుష్పరాజ్ కోసం ఎదురుచూపులు

2021లో విడుదలైన 'పుష్ప' సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఏ రేంజ్‌లో సత్తా చాటిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాకు కొనసాగింపుగా పార్ట్ 2 ఉంటుందని దర్శకుడు



సుకుమార్ మంచి హైప్‌తో క్లైమాక్స్‌ను ముగించారు. మొదటి భాగానికి మించిన హిట్ కొట్టాలనే లక్ష్యంతో మేకర్స్ ఈ సీక్వెల్‌ను చాలా జాగ్రత్తగా తీర్చిదిద్దుతున్నారు. మొదటి భాగంలో పుష్పరాజ్‌గా అందరినీ అలరించిన అల్లుఅర్జున్.. రెండో భాగం 'పుష్ప:ద రూల్'లో ఏ రేంజ్‌లో చెలరేగుతాడో అని అభిమానులు ఆసక్తిగా కోసం ఎదురుచూస్తున్నారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

గేమ్ చేంజర్‌గా...

రామ్‌చరణ్, డైరెక్టర్ శంకర్ కలయికలో తెరకెక్కుతోన్న మాగ్నమ్ ఆపస్ ఎంటర్టైనర్ 'గేమ్ చేంజర్'. ఈ సినిమాలో రామ్‌చరణ్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని టాక్. అందులో ఒక పాత్ర అవినీతితో పోరాటం చేస్తుందని సమాచారం. ఈ సినిమాపై అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. డిసెంబరు 20న ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

దసరాకి వేట మొదలు

'జై భీమ్' ఫేమ్ టీ.జే.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమి





తాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజువారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. రజనీకాంత్, అమితాబ్ 33 ఏళ్ల తర్వాత కలసి నటిస్తున్న చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఇందులో ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కన్నప్ప కనువిందు...

మంచు విష్ణు నటిస్తున్న మైథలాజికల్ చిత్రం 'కన్నప్ప'. అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. ఇందులో ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్ సహా పలువురు తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను కేన్స్ చిత్రోత్సవంలో విడుదల చేయడం విశేషం. డిసెంబర్ 20న విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

పోరాట యోధుడి పాత్రలో...

తమిళ హీరో సూర్య పోరాట యోధుడిగా.. నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. నవంబర్ 14న దాదాపు పది



భాషల్లో త్రీడీలో, 2డీలో విడుదలవుతోంది. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్', 'వీరుడొక్కడే', 'వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో సూర్యకు పాన్ ఇండియా గుర్తింపు ఖాయం అని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

గోపీచంద్ విశ్వం

గోపీచంద్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న గోపీచంద్‌కు, శ్రీనువైట్లకు ఈ సినిమా రిజల్ట్ కీలకం కానుంది. దసరా కానుకగా అక్టోబర్ 11న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి


శిక్షణ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో కృష్ణ

గుంటూరు సిటీ, సెప్టెంబరు 27: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పనిచేయాలని జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు అన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, డీఎల్‌పీవోలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి ప్రసంగించారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, డీఎల్‌పీవోలకు రెండు విడతల్లో ఈ శిక్షణ తరగతులు ఉంటాయని సీఈవో పేర్కొన్నారు. మొదటి బ్యాచ్‌కి ఈ నెల 27 నుంచి 29 వరకు, రెండో బ్యాచ్‌కి అక్టోబర్ 3 నుంచి 5 వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో రాజీలేని సూత్రాలు, గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ విధులు, బాధ్యతలు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994లోని సెక్షన్ 45, 46, ఇతర జీవోలపై పెదకూరపాడు ఎంపీడీవో పి.రామకృష్ణ, తుళ్లూరు ఈవోపీఆర్డీ పి.నాగనాథ్, ముట్లూరు పీఎస్ డి. సుబ్బారావు, దామరపల్లి పీఎస్ డి.అరుణ్ కుమార్ శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, జిల్లా శిక్షణ మేనేజర్ కంచర్ల నాగేశ్వరరావు, జిల్లా రిసోర్స్ పర్సన్స్ నిరంజన్‌రావు, కరిముద్దీన్, అనూరాధ, సెక్షన్ ఏవో ప్రసాదు పాల్గొన్నారు.

13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్-2024

అమరావతి, సెప్టెంబరు 27 : జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో అక్టోబరు 13వ తేదీ ఉదయం 6 గంటలకు 'ఇండియా పోస్ట్ రన్ 2024'ను గుంటూరులో నిర్వహిస్తున్నట్లు పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్వీఆర్ మూర్తి తెలిపారు. కృష్ణలంక బాలాజీనగర్‌లోని పోస్టల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం అయన మాట్లాడుతూ, ఫిట్ ఇండియా, ఫిట్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో క్రీడాకారులను, యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంగా ఈ రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 5కె, 10కె విభాగాల్లో, 3కె రన్ ఫన్ రన్‌గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5కె, 10కె పురుషుల, మహిళల విజేతలకు రూ.2,40,000 వరకు నగదు రివార్డులతోపాటు, రన్‌లో పాల్గొనే వారికి టీషర్టు, ఫినిషర్స్ మెడల్, హైడ్రెషన్, న్యూట్రిషన్ సపోర్ట్ ఉంటుందన్నారు. 3కె రన్ 1.5 కి.మీ, 5కె రన్ 2.5 కి.మీ, 10కె రన్ 5కిలోమీటర్లు జరుగుతుందని, ఈరన్ 25 ఏళ్లలోపు, 25 నుంచి 40 ఏళ్ల లోపు, 40ఏళ్ల పైబడిన విభాగాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రన్ గుంటూరులోని ఎల్ కాలేజీ నుంచి ప్రారంభమై గవర్నమెంటు మెడికల్ కాలేజీ హస్టల్, ప్రభుత్వ ఫీవర్ హస్పటల్, హోసన్నా మందిర్ మీదుగా తిరిగి ఎల్ కాలేజీ వరకు ఉంటుందన్నారు. రన్‌ను మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభిస్తారని, పాల్గొనదలచిన వారు తమ వివరాలను ఇండియా పోస్టరన్ఏపీ.ఐక్యూ301.కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

పాము కాటుకు మహిళ మృతి

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 27 : పాము కాటుకు మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యానాది కాలనీకి చెందిన చెన్నంశెట్టి శివమ్మ(40) చేపలు పట్టేందుకు ధూళిపాళ్ల సమీపంలోని ఎద్దు వాగు వద్దకు వెళ్లింది. చేపలు పడుతుండగా పాము కాటు వేయటంతో కుటుంబ సభ్యులు ఆమెను సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. శివమ్మను పరిశీలించిన వైద్యులు ఆమె మృతి చెందినట్టు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీ నిబంధనల ఉల్లం'ఘనులు'

- రూల్స్‌కు విరుద్ధంగా చేశారంటూ విమర్శలు
- అస్మదీయులకు పెద్దపీట వేశారంటూ ఆరోపణలు
- సీఎం, ఆర్థిక మంత్రికి ఉద్యోగ సంఘాల నాయకుల ఫిర్యాదులు


వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం

గుంటూరు, సెప్టెంబరు 27: వాణిజ్య పన్నులశాఖ జోన్-3 పరిధిలోని గుంటూరు-1,2 డివిజన్‌లలో జరిగిన ఉద్యోగుల బదిలీల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు బదిలీల్లో ఏమాత్రం నిబంధనలు పాటించలేదని, అస్మదీయులకు పెద్దపీట వేసేందుకే పనిచేశారంటూ ఉద్యోగ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా వాణిజ్య పన్నుల శాఖలో జరిగిన బదిలీలు చర్చనీయాంశంగా మారాయి. వాస్తవానికి సిటీ శాఖలో బదిలీల ప్రక్రియ నిర్వహించేందుకు రాష్ట్ర స్థాయిలో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో కమిషనర్‌లదే ఇష్టారాజ్యంగా మారిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జోన్-3 పరిధిలోని బదిలీలను పరిశీలిస్తే..

జోన్-3 పరిధిలోని బదిలీలను పరిశీలిస్తే నిబంధనలు ఏమాత్రం పాటించలేదని స్పష్టమవుతోందని విమర్శిస్తున్నారు. నిబంధనల మేరకు ప్రతి 13 మందిలో నలుగురు తప్పనిసరిగా బదిలీల పరిధిలోకి రావాలి. వీరికి బదిలీలు నిర్వహించిన తరువాతనే మిగిలిన విజ్ఞాపనల బదిలీలు చేయాల్సి ఉంది. కానీ దానికి విరుద్ధంగా బదిలీలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చేసిన నాలుగు బదిలీల్లోనూ మార్గదర్శకాలను పాటించలేదు. ఉద్యోగ సంఘంలో సభ్యులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోలేదు. మార్గదర్శకాల ప్రకారం గుంటూరు, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో ఉన్న రెండు డివిజన్‌లలో అదే సిటీలో ఉంచుతూ డివిజన్ నుంచి స్పష్టం చేశారు. తాజా బదిలీల్లో గుంటూరు-2 డివిజన్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న డిప్యూటీ ఏసీ వె.హరికృష్ణ ఏపీ సిటీ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. తాజా బదిలీల్లో నిబంధనలు పాటించకుండా హరికృష్ణను కూడా నెల్లూరు డివిజన్‌కు బదిలీ చేశారు. గుంటూరు-1 జేసీ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ ఏసీ టి.అశోక్‌కుమార్‌ను గుంటూరు-2 డివిజన్‌కు బదిలీ చేయాల్సి ఉన్నా, గుంటూరు-1 డివిజన్‌లోని పెదకాకాని సర్కిల్‌కు బదిలీ చేశారు. అలానే మరో డిప్యూటీ ఏసీ ఈ.శ్రీనివాసులు నుంచి గుంటూరు 1 డివిజన్ నుంచి గుంటూరు-2 డివిజన్‌కు బదిలీ చేయాల్సి ఉన్నప్పటికీ మార్గదర్శకాలు ఏమాత్రం ఖాతరు చేయకుండా నెల్లూరు డివిజన్‌కు బదిలీ చేశారు. పెదకాకాని సర్కిల్‌లో పని చేస్తున్న మరో డిప్యూటీ ఏసీ కె.కృష్ణమోహన్ స్పెషల్ ఆడిట్ విభాగానికి సంబంధించిన వారిని అదే ఆడిట్ విభాగానికి బదిలీ చేయాల్సి ఉన్నప్పటికీ, గుంటూరు-2 జేసీ కార్యాలయం మేనేజర్‌గా బదిలీ చేయటాన్ని తప్పుపడుతున్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

బదిలీల ప్రక్రియలో జరిగిన అవకతవకలపై ఏపీ సిటీ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు సీఎంకు, ఆర్థిక మంత్రి, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. బదిలీల ప్రక్రియ కమిటీలతో కాకుండా నేరుగా ప్రభుత్వమే చేపట్టాలని, జరిగిన బదిలీలపై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. బదిలీల్లో అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నెలలో వస్తా.. సమస్యలు తొలగాలి

- గురుకుల ప్రిన్సిపాల్‌ను హెచ్చరించిన ప్రత్తిపాటి


440 మంది విద్యార్థులకు ఈ పెరుగు సరిపోతుందా అని ప్రిన్సిపాల్, వంట తయారీ దారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

బోయపాలెం(యడ్లపాడు), సెప్టెంబరు 27: 'నెలలో వస్తా.. సమస్యలు పరిష్కారం కావాలి. లేకుంటే కఠిన చర్యలు తప్పవు. నిర్వహణ చేయలేకుంటే సెలవు పెట్టి వెళ్లాలి. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా స్థానికంగా ఉండి పర్యవేక్షించాలి. గతంలో తలెత్తిన సమస్యలు ప్రథమ తప్పుగా భావిస్తున్నాం. విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించేది లేదు..' అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బోయపాలెం పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలని ప్రిన్సిపాల్ హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్‌ను శిరీష్‌బాబులను హెచ్చరించారు. ఇటీవల పదో తరగతి విద్యార్థులు గోడదూకి పారిపోయిన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. తొలుత విద్యార్థులను కలసి పారిపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారం, తాగునీరు అందించడం లేదని, అన్నంలో పురుగులు ఉంటున్నాయని, అన్ని మరుగుదొడ్లను వాడుకోనీయడం లేదని, ఉన్నవి కూడా శుభ్రంగా లేవని, వాటిని తమతోనే శుభ్రం చేయిస్తున్నారని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. తరగతి గదుల్లో బెంచీలు లేవని, ఫ్యాన్లు తిరగడం లేదని, సరైన ఆట స్థలం కూడా లేదని, బోధన కూడా బాగా లేదని ఫిర్యాదు చేశారు అనంతరం వంటగదిని సందర్శించి ఆహార పదార్థాలను పరిశీలించారు. అన్నం ముద్దగా ఉండడాన్ని చూసి పెదవి విరిచారు. గిన్నెలోని పెరుగును చూసి ఈ కాస్త పెరుగు 440 మంది విద్యార్థులకు ఏ విధంగా సరిపోతుందని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం సరిపడ ఆహారం అందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తున్న వంటవారిపై మండిపడ్డారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం పెట్టాలని ఆదేశించారు. ఫ్యాన్లు, లైట్లకు మరమ్మతులు చేయించాలని, మరుగుదొడ్లు బాగుచేయించాలని, అన్నింటినీ వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు తదితరులు ఉన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

నూజెండ్ల, సెప్టెంబరు 27 : ప్రధానమంత్రి సడక్ యోజన పథకం నిధులతో చింతలచెరువు, అందుగులపాడు రోడ్లను అనుసంధానం చేసేందుకు గుండ్లకమ్మ నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రహదారుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందన్నారు. అనంతరం గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి ఈ ప్రాంత అభివృద్ధిపై నాయకుల విజ్ఞప్తులను పరిశీలించారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గుండ్లకమ్మ నదిపై బ్రిడ్జి నిర్మాణంతో కురిచేడు, చింతలచెరువు, మృత్యుంజాపురం తదితర పరిసర గ్రామాల వారికి జాతీయ రహదారితో అనుసంధానం జరుగుతుందన్నారు. గుండ్లకమ్మ నదిపై ఎత్తి పోతల పథకాలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జెడ్పీటీసీ సభ్యుడు జెడ్డా సుబ్బులు రామయ్య, జనసేన నేత నిశ్శంకరరావు, శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు ముండ్రు సుబ్బారావు, వంకాయలపాటి పేరయ్య, నూజెండ్ల, వినుకొండ మండలాల టీడీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'ఐక్యా 2కే24'


సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

పెదకాకాని, సెప్టెంబరు 27: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలోని ఐఈటీఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఐక్యా 2కే24 సాంకేతిక సదస్సును ఐఈటీఈ విద్యార్థి విభాగం చైర్మన్ డాక్టర్ బి.సూర్యప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో 30 కళాశాలలకు చెందిన 1400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డైవ్ ఇన్ థాట్స్, బ్రేకింగ్ కోడ్స్, మిస్టరీ లూట్, క్రియేటివ్ క్లాష్ వంటి 15 సాంకేతిక అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐఈటీఈ చైర్మన్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న ఆధునిక సాంకేతికతను, 6జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిని సరైన మార్గంలో మానవాళి అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, ఇటువంటి సాంకేతిక సదస్సుల వలన విద్యార్థులు సాంకేతిక మార్పులను సులభంగా తెలుసుకోవచ్చుని అన్నారు. ఈసీఈ విభాగాధిపతి ఎమ్.భానుమూర్తి, ఐఈటీఈ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

బయటకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు

- దివ్యాంగుని ఆవేదన
- వెంటనే వీల్‌చైర్ అందించిన మంత్రి లోకేశ్
- 36వ రోజు ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, సెప్టెంబరు 27: ఉండవల్లిలో మంత్రి లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు శుక్రవారం 36వ రోజు ప్రజలు భారీగా వచ్చి సమస్యలతో కూడిన అర్జీలు అందించారు. పుట్టుకతో పూర్తి అంగవైకల్యం బారినపడి కనీసం మాట్లాడలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడి అభ్యర్థనను మంత్రి నారా లోకేశ్‌ను కదిలించింది. ప్రజాదర్బార్‌కు వచ్చే దివ్యాంగుల సౌకర్యార్థం ఉండవల్లి నివాసంలో లోకేశ్ పలు వీల్‌చైర్‌లను అందుబాటులో ఉంచారు. అందులోనే తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన గాదం ఆనంద్ తేజ తల్లిదండ్రుల సాయంతో మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. తనను బయటకు తీసుకెళ్లేందుకు తన తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, తన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉందని లోకేశ్‌కు చెప్పగానే స్పందించిన ఆయన అదే వీల్‌చైర్‌ను సదరు దివ్యాంగునికి అందజేశారు. సంతోషంతో దివ్యాంగుడు అదే వీల్‌చైర్‌లో ఇంటికి వెళ్లాడు.

నియోజకవర్గం నుంచి వచ్చిన విజ్ఞప్తులు ఇవే..

కుమార్తె వైద్య విద్య కోసం బ్యాంకు రుణం పొందేందుకు తన ఇంటికి ఎంటీఎంసీ, సీఆర్‌డీఏ నుంచి పూర్తి అనుమతులు మంజూరు చేయించాలని పెదవడ్లపూడికి చెందిన మున్నంగి పానకాలు విజ్ఞప్తి చేశారు. 2009లో తన స్థలంలో రెండు అంతస్తుల ఇల్లు నిర్మించుకున్నానని, నిర్మాణ సమయంలో కార్పొరేషన్ విధి విధానాలు గ్రామానికి పూర్తి స్థాయిలో రానందున నిర్మాణ అనుమతులు తీసుకోలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కొల్లేటరల్ ష్యూరిటి నిమిత్తం ఇంటిని తనఖా పెట్టి రుణం పొందేందుకు కార్పొరేషన్ ద్వారా తన ఇంటికి అనుమతులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భర్త చనిపోయిన తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని మంగళగిరికి చెందిన చందలూరి విజయకుమారి విజ్ఞప్తి చేశారు. సొంత ట్రాక్టర్ కలిగి ఉన్న తన భర్తకు స్థానికంగా ఉచిత ఇసుక సరఫరా చేసేందుకు అవకాశం కల్పించాలని మంగళగిరికి చెందిన జొన్నకూటి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి విజ్ఞప్తులివే..

తనఖా రిజిస్ట్రేషన్ అని చెప్పి మోసంతో జీపీఏ సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకుని తన భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కాకినాడ జిల్లా భీమవరపుకోటకు చెందిన ఆళ్ల దేవి మంత్రి లోకేశ్‌ను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. అన్నమయ్య జిల్లా కోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా చేస్తున్న తన భర్త గుండెపోటుతో మృతి చెందారని, బీఎస్సీ బీఈడీ చదివిన తనకు వయోపరిమితి సడలించి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కొరివి దాక్షాయణి విజ్ఞప్తి చేశారు. గత పదేళ్ల నుంచి వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ డిపార్టుమెంట్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

గ్రీన్ గ్రేస్ నిర్మాణాలు నిలిపివేయాలి

- పీసీబీకి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఫిర్యాదు



గుంటూరు, పొన్నూరుటౌన్, సెప్టెంబరు 27: పర్యావరణ అనుమతుల్లేని గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పర్యావరణ శాఖను ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కోరారు. గుంటూరు పట్టణంలో గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణాలపై శుక్రవారం పర్యావరణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లేఖ ద్వారా నరేంద్ర కుమార్ ఫిర్యాదు చేశారు. 2015 జూలై 9న ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నాలుగు టవర్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి పర్యావరణ అనుమతులు తీసుకుందన్నారు. అయితే 2019 జూలై 12న ఆదిత్య ఇన్‌ఫ్రా ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు చెప్పారు. ఆ తరువాత బజరంగ్ జూట్ మిల్లుగా ఉన్న పేరును ఏలూరు జూట్ మిల్లుగా మార్చుకున్నట్లు చెప్పారు. 2023 నవంబరు 7వ తేదీన ఏలూరు జూట్ మిల్లు సంస్థ బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అభివృద్ధి ఒప్పందం కుదుర్చుకుందన్నారు. పర్యావరణ, పొల్యూషన్ అనుమతులు లేకుండా నిర్మాణాలు ప్రారంభించినట్లు ఆరోపించారు. ఆదిత్య ఇన్‌ఫ్రా లిమిటెడ్ జారీ చేసిన ఎన్వోసీ కూడా లేదన్నారు. ఈసీ ఆర్డర్ తేదీలో పేర్కొన్న షరతులను ఖచ్చింగా పాటించాలని అఫిడవిట్ దాఖలు చేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్‌కి అనుమతి పొందలేదన్నారు. ఆదిత్య ఇన్‌ఫ్రా సమర్పించిన డిజైన్, ప్లాన్, స్ట్రక్చర్ ఏలూరు జూట్ మిల్లుల కంటే పూర్తి భిన్నంగా ఉన్నందున సమూల విచారణ జరపాలని అధికారులను కోరారు. ఏలూరు జూట్ మిల్లుల నిర్మాణంలో డిజైన్, ప్లాన్, నిర్మాణ విస్తీర్ణం, టవర్ల సంఖ్య బజరంగ్ ఇన్‌ఫ్రా సంస్థ ప్లాన్లతో పూర్తిగా భిన్నంగా ఉన్నట్లు చెప్పారు. 2023లో ఈ ఒప్పందాన్ని బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా కుదుర్చుకుందన్నారు. అయితే గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణానికి తాజాగా ఎటువంటి ఈసీ క్లియరెన్స్ తీసుకోలేదన్నారు. ఎన్‌జీటీ ప్రకారం అపార్టుమెంట్ల ప్రారంభానికి అనుమతి లేకుండా నిర్మాణాలు జరిగినట్లు ఆరోపించారు. నిబంధనలు అతిక్రమించి, ఉల్లఘించిన వారిపై చట్టపరంగా జరిమానాలు విధించాలని డిమాండ్ చేశారు. మోసపూరితమైన విధానంతో రిజిస్ట్రేషన్ బదిలీ, బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ పేరుతో చేస్తున్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు చేసిన ఫిర్యాదులో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పేర్కొన్నారు.

నష్ట పరిహారం అందక రైతుల ఆందోళన


మండల వ్యవసాయ కేంద్రం వద్ద పెదమద్దూరు గ్రామ రైతుల ఆందోళన

అమరావతి, సెప్టెంబరు 27: వరద ప్రభావంతో పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నష్ట పరిహారం అందకపోవడంతో మండల వ్యవసాయ కార్యాలయం వద్ద పెదమద్దూరు గ్రామానికి చెందిన బాధిత రైతులు ఆందోళనకు దిగారు. సుమారు 30 మంది రైతులకు చెందిన పంట పొలాలు ముంపు జాబితాలో లేకపోవడం వల్లనే తమకు పరిహారం రాలేదని, వ్యవసాయశాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే తమకు అన్యాయం జరిగిందని ఏవో అహ్మద్‌ను నిలదీశారు. తమ గ్రామానికి చెందిన వ్యవసాయశాఖ అధికారి సునీత ఈ క్రాప్ బుకింగ్ చేయకపోవడం వల్లనే తమకు అన్యాయం జరిగిందని రైతులు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. పరిహారం అందని రైతుల జాబితాను మళ్లీ ప్రభుత్వానికి పంపిస్తామని, పరిహారం అందని రైతుల పంటలకు ఇన్సూరెన్స్ వచ్చే విధంగా ప్రయత్నిస్తామని ఏవో అహ్మద్ రైతులకు హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన కొందరు వైసీపీ వర్గీయులకు పంట నష్టం జరగకపోయినా నష్ట పరిహారం అందిందని రైతులు ఆరోపించారు.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ సీఈవో కృష్ణ



గుంటూరు సిటీ, సెప్టెంబరు 27: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా సీహెచ్ కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డిప్యూటీ సీఈవోగా పని చేసిన జె.మోహన్‌రావు వద్ద నుంచి ఆయన బాధ్యతలు చేపట్టారు. నెల్లూరుకు బదిలీ అయిన డిప్యూటీ సీఈవో మోహన్‌రావు శుక్రవారం రిలీవ్ అయ్యారు. నూతన డిప్యూటీ సీఈవోను పలు సెక్షన్ల ఏవోలు, పీఆర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నేత డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, ప్రసాదు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

నాణ్యమైన ఎరువులు అందించాలి

గుంటూరు, సెప్టెంబరు 27: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించేందుకు మార్కెటింగ్ సొసైటీ ముందుండాలని ది గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్ఎస్) పర్సన్ ఇన్‌ఛార్జ్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ సూచించారు. జిల్లా కోర్టు రోడ్డులో ఉన్న డీసీఎమ్ఎస్ కార్యాలయంలో మహాజన సభ శుక్రవారం జరిగింది. డీసీఎమ్ఎస్‌కు పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న జేసీ భార్గవతేజ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించటంతోపాటు ఎప్పటికప్పుడు ఎరువులు, పురుగు మందులు నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సహకార మార్కెటింగ్ సొసైటీని బలోపేతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడా ఎటువంటి అవకతవకలు లేకుండా వ్యవహరించాలన్నారు. సొసైటీ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం మాట్లాడుతూ ఎజెండాలోని అంశాలను చదివి వినిపించారు. 2023-24 సంవత్సరంలో సంఘం ఆడిట్ రిపోర్ట్ ప్రకారం సంఘం రూ.1,08,09,811 నికర లాభం ఆర్జించినట్లు వివరించారు. అలానే ఎజెండాలోని అంశాలను చదివి వినిపించగా సభ్యులు చేతులు పైకి లేపి ఆమోదం తెలియజేయగా జేసీ ఆమోదించారు. కార్యాలయం మేనేజర్ శ్రీనివాసరావు, స్వామినాథన్, అగ్రి కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు వి.లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జ్‌లు హాజరయ్యారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

అర్ధాకలితో అల్లాడుతున్న బీసీ హాస్టల్ విద్యార్థులు

● నీళ్ల పప్పు, పురుగుపట్టిన పిండి

● హాస్టల్‌ను పరిశీలించిన ఎంపీపీ సాయిశంకర్



నీళ్ల పప్పుపై ప్రశ్నిస్తున్న ఎంపీపీ సాయిశంకర్

దుర్గి, సెప్టెంబరు 27: దుర్గిలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. మెనూను పాటించకుండా నీళ్ల పప్పు, పురుగుపట్టిన పిండి, కుళ్లిపోయిన టమాటాలతో భోజనం వండుతున్నారు. గురువారం రాత్రి ఎంపీపీ యేచూరి సాయిశంకర్ హాస్టల్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం తోటకూర పప్పు, దొండ కాయ ఫ్రై వడ్డించాల్సి ఉండగా నీళ్ల పప్పు దర్శనమిచ్చింది. దీంతో ఎంపీపీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో రిజిస్టర్లు ఉండకపోవడంతో వార్డెన్ బెన్‌హర్‌బాబును నిలదీయగా పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆగ్రహించారు. 100 మందికిగాను 60 మంది విద్యార్థులు ఉండడం, వారికి సైతం చాలీచాలని భోజనం వడ్డిస్తున్నారని గుర్తించారు. వంటశాలను పరిశీలించగా పురుగుపట్టిన శనగ పప్పు, మినపపప్పు, ఉప్మారవ్వలు కనిపించడంతోపాటు లీటన్నర పాలును 60 మంది విద్యార్థులకు అందిస్తుండడం ఎంపీపీ గుర్తించారు. ఇటువంటి వాటితో ఆహారాన్ని తింటే పిల్లల ఆరోగ్యం ఏం కావాలంటూ ప్రశ్నించారు. పిల్లలు అనారోగ్యంకు గురైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై విద్యార్థులను ప్రశ్నించగా విద్యార్థులు భయంతో సరైన సమాధానం చెప్పలేకపోయారని ఎంపీపీ సాయిశంకర్ అన్నారు.

రోగులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



సుబాన్‌బీకి చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, సెప్టెంబరు 27 : సమాజంలో వివిధ రకాల రోగాలతో ఇబ్బందిపడుతూ చేతిలో చిల్లి గవ్వ లేని నిరుపేదలకు తానున్నానంటూ సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని తుమ్మకోట గ్రామానికి చెందిన గోరే బుడే జానీ బాషా అనారోగ్యానికి గురవ్వడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. జానీ భాష భార్య సుబాన్‌బీకి శుక్రవారం రూ.85 వేల సీఎం సహాయ నిధి చెక్కును అందచేశారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ఎవరికి ఎటువంటి సహాయం కావాలన్నా తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు.

రెంటచింతల పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్

● సిబ్బందిని అభినందించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, సెప్టెంబరు 27 : రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికెట్ లభించింది. గత నెల 2న కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వైద్యుల బృందం పీహెచ్‌సీని పరిశీలించి రోగులతో ప్రత్యేకంగా సమావేశమై పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. నూటికి 91 శాతం నియమ నిబంధలను పాటించడం వైద్య బృందం సమిష్టిగా వ్యవహరించడంతో పాటు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వుండడంతో ఈ ఎన్‌క్వాస్ సర్టిఫికెట్‌ను శుక్రవారం మెయిల్ ద్వారా పంపినట్లు డాక్టర్ కృష్ణారెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఫోన్‌లో డాక్టర్ కృష్ణారెడ్డితో పాటు వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

మాచర్ల సబ్ రిజిస్ట్రార్‌గా ఐజక్



ఐజక్

మాచర్లటౌన్, సెప్టెంబరు 27! మాచర్ల సబ్ రిజిస్ట్రార్‌గా ఐజక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గిద్దలూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ప్రశాంతి బదిలీపై గురజాలకు వెళ్లారు.

గురజాల ఆర్డీవోగా మురళీకృష్ణ

గురజాలటౌన్, సెప్టెంబరు 27: గురజాల ఆర్డీవోగా మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన సత్తెనపల్లి ఆర్డీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన రమణకాంత్‌రెడ్డిని సత్తెనపల్లి ఆర్డీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

తాగునీటికి అల్లాడుతున్న మారుతీనగర్ కాలనీ వాసులు

దుర్గి, సెప్టెంబరు 27: ఇటీవల వర్షాలు పుష్కలంగా కురిసి కుంటలు, చెరువులు నిండి బోర్లలో నీరు పుష్కలంగా వస్తున్నప్పటికీ దుర్గి గ్రామానికి నీటిని వదిలే ఆపరేటర్ నియంతలా వ్యవహరిస్తూ తమ కాలనీకి నీటిని వదలకుండా ఇబ్బంది పెడుతున్నారని మారుతీనగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ముటుకూరు రోడ్డు వద్ద ఖాళీ బిందెలతో కాలనీలోని మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గతంలో తాము ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎంపీపీ సాయిశంకర్ తన సొంత ఖర్చుతో కాలనీ వాసులకు నీటిని అందించేందుకు ముందుకొచ్చారు. అయితే ఆపరేటర్ కాలనీకి నీరు రాకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కాగా కాలనీ వాసులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఆపరేటర్ అక్కడకు చేరుకొని కాలనీ వాసులతో మాట్లాడి నీటిని విడుదల చేయడంతో కాలనీ వాసులు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న మారుతీనగర్ కాలనీ వాసులు

విద్యుత్ శాఖ ఈఈ హరిబాబుకు సన్మానం

మాచర్లటౌన్, సెప్టెంబరు 27 : మాచర్ల విద్యుత్ శాఖ ఈఈ జె.హరిబాబును శుక్రవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ శాఖకు చెందిన పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈఈ హరిబాబు సీఆర్‌డీఏ టెక్నికల్ అండ్ కన్‌స్ట్రక్షన్‌కు ఈఈగా బదిలీ అయ్యారు. ఈ మేరకు అధికారులు హరిబాబును దుశ్శాలువాలతో సన్మానించారు. విధి నిర్వహణలో అవార్డులతో పాటు వినియోగదారుల మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌వోలు సందీప్‌కుమార్ (పిడుగురాళ్ల), చంద్రశేఖర్ (మాచర్ల), ఆశీర్వాదం (దాచేపల్లి), డీఈఈ వీరేశ్వరరావు, ఏఈ భగవాన్, దండా నాగేశ్వరరావు, సబ్ ఇంజనీర్ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా నిలవాలి

● జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంకారావు

గురజాలటౌన్, సెప్టెంబరు 27: ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతుగా నిలవాలని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంకారావు శుక్రవారం కోరారు. ఇందులో భాగంగా ఈనెల 30వ తేదీన ప్రతి గ్రామంలో దీపారాధన, అక్టోబరు 1న ఓం నమో నారాయణ మంత్ర పఠనం, 2న నగర సంకీర్తన, 3న ఆలయాల్లో భజనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జనసేన నేతలు, కార్యకర్తలు, వీర మహిళలు కార్యక్రమం విజయవంతానికి ముందుకు రావాలని అంకారావు కోరారు.

కేజీబీవీల్లో మహిళలకు అవకాశం : జీసీడీవో

రెంటచింతల, సెప్టెంబరు 27 : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో బోధన సిబ్బంది పోస్టులు 15, ఎకౌంటెంట్ పోస్టు 1కు దరఖాస్తు చేసుకోవాలని జీసీడీవో డి.రేవతి కోరారు. శుక్రవారం రెంటచింతలలో విలేకరులతో మాట్లాడుతూ అక్టోబరు 10లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీఆర్‌టీ(కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్)పీజీటీలకు నెలకు రూ.26,759 చెల్లిస్తామన్నారు. బీఈడీ ఖచితంగా ఉండాలని దరఖాస్తు రుసుం రూ.250లఅన్నారు. ఓపెన్ క్యాటగిరి అభ్యర్థులకు 18-42, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి ఐదేళ్లు, మాజీ సైనిక ఉద్యోగినులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు వర్తిస్తుందన్నారు. మిట్టగుడిపాడు కేజీబీవీలో సీఆర్టీ సోషల్ పోస్టు ఖాళీగా ఉందన్నారు.

స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలు

కారంపూడి, సెప్టెంబరు 27: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలను నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అధికారులు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా ర్యాలీలు జరిపారు. ప్లాస్టిక్ వాడడాన్ని నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పరస్పర దాడుల్లో ముగ్గురికి గాయాలు

దుర్గి, సెప్టెంబరు 27: పరస్పర దాడుల్లో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని ముటుకూరులో శుక్రవారం జరిగింది. ఒకే సామాజిక వర్గానికి ఏరువాల లింగేశ్వరరావు, పేరువాల ఆనంద్ మధ్య ఘర్షణ తలెత్తి దాడులకు దిగారు. తాను పెంచుకుంటున్న కోడిని దొంగిలించాడని ఆనంద్ అతని భార్య మరియమ్మలు లింగేశ్వరరావు ఇంటికి వెళ్లి ప్రశ్నించారు. ఈ క్రమంలో వారి మధ్య ఘర్షణ తలెత్తి పరస్పర దాడులకు దిగారు. గొడ్డళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో లింగేశ్వరరావు తలకు, వీపుపై గొడ్డలి గాయాలయ్యాయి. కాగా ఆనంద్ తలకు, అతని భార్య మరియమ్మ చేయి, కాలుకు గాయాలయ్యాయి. వీరిని మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దుర్గి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేల్పూరు పంచాయతీలోని డొంక పోరంబోకు ఆక్రమణ

అచ్చంపేట, సెప్టెంబరు 27 : మండలంలోని వేల్పూరు పంచాయతీ పరిధిలో గల సర్వే నెంబరు 538లో డొంక పోరంబోకును ఆక్రమించి అక్రమ కట్టడాలు కట్టారు. ఈ నేపథ్యంలో అక్రమ కట్టడాలను తొలగించాలంటూ పంచాయతీ అధికారులు సుమారు 27 మందికి నెల రోజుల క్రితం నోటీసులు అందించారు. వేల్పూరు పరిధిలోని క్రోసూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద డొంక పోరంబోకు ఉంది. 35 నుంచి 40 అడుగుల వెడల్పు ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. పంచాయతీ, సీఆర్‌డీఏ అనుమతులు లేకుండా దుకాణాలు, రెండంతస్తుల బిల్డింగ్‌లు కూడా కట్టారు. ఈ నేపథ్యంలో వేల్పూరు పంచాయతీ అధికారులు అక్రమ కట్టడాలను గుర్తించి సచివాలయ సర్వేయర్‌తో ఆక్రమించిన స్థలాలను మార్కింగ్ చేశారు. వెంటనే ఆక్రమణలను తొలగించాలి, లేకుంటే క్రమబద్ధీకరించి పంచాయతీకి ఆదాయ వనరులు పెరిగే విధంగా అధికారులు కూడా ముందుకు రావాలని గ్రామ సర్పంచ్ జువ్వా శంకర్ కోరారు.

రాష్ట్ర, జిల్లా స్థాయిలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

అచ్చంపేట, సెప్టెంబరు 27 : అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశా లకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు రెజ్లింగ్(కుస్తీ) పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ డాక్టర్ టీ.అరుణ్ కుమార్ తెలిపారు. అండర్-19 విభాగంలో సీహెచ్ రామ మనోహర్, సిద్దార్థ్, శ్రీకాంత్, కళ్యాణ్, చంటి, అద్భుత్, సూర్య, భరత్, సాంబ రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా అండర్-14 విభాగం పరుగు పందెంలో జగదీష్ గౌరు, అంజి నాయక్, పీ.నాగ చైతన్య జిల్లా స్థాయికి ఎంపిక కాగా అండర్-17 కబడ్డీ విభాగంలో దినకర్, కే.పుల్లయ్య, అభిషేక్ నాయక్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. పీడీ నూన్సావత్ సత్యనారాయణ నాయక్, పీఈటీ జీ.బ్రహ్మయ్యను ప్రిన్సిపల్ అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

నష్ట పోయిన రైతులకు న్యాయం చేయాలి

అచ్చంపేట, సెప్టెంబరు 27 : మండలంలోని రుద్రవరం, ఓర్వకల్లు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయని, ఈ రైతులకు న్యాయం చేయాలని శుక్రవారం మండల తహసీల్దార్ శ్రీనివాస్‌కు రైతులు వినతిపత్రం అందించారు. పూర్తి స్థాయిలో నష్టపడ్డ రైతుల పేర్లు రాయలేదని తహసీల్దార్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కంపరాజు బ్రహ్మరాజు, పూల రత్తయ్య, పూల వీరయ్య తదితర రైతులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

ఎంపీడీవోను కలసిన ఉపాధి హామీ సిబ్బంది

బెల్లంకొండ, సెప్టెంబరు 27 : బెల్లంకొండ నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన హనిమిరెడ్డికి బెల్లంకొండ ఉపాధి హామి సిబ్బంది శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామి పనులు ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబధనల మేరకే చేపట్టాలని, గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అందరి ఆమోదంతోనే పనులు చేయాలని సూచించారు. ఎంపీడీవోను కలిసిన వారిలో ఉపాధి హామి సిబ్బందితో పాటు మండల టీడీపీ నాయకులు, బెల్లంకొండ త్రిసభ్య కమిటీ మెంబరు పీఎస్‌కే రసూల్, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, చంద్రాజుపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులు ఓర్సు ఆనంద్ తదితరులు నూతన ఎంపీడీవోను మర్యాద పూర్వకంగా కలిశారు.

రక్తహీనత నుంచి విద్యార్థులను కాపాడాలి : ప్రిన్సిపల్

బెల్లంకొండ, సెప్టెంబరు 27 : రక్తహీనత నుంచి విద్యార్థులను కాపాడాలని బెల్లంకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బత్తుల ఉమాదేవి అన్నారు. బెల్లంకొండ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఎవరికైతే కనీస రక్త స్థాయి కన్నా తక్కువ ఉంటుందో ఆ విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ, ప్రత్యేకమైన ఆహారం తీసుకొనేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జే.లక్ష్మి మాట్లాడుతూ రక్తహీనత నుంచి ప్రతి ఒక్కరిని కాపాడాలని సూచించారు. అధ్యాపకులు శారదాదేవి, రమేష్ బాబు, సత్యప్రభ, కుసుమ కుమారి, రత్నకుమారి, బాలూ నాయక్, నరసింహారావు పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్రల పంపిణీ జయప్రదం చేయాలి

క్రోసూరు, సెప్టెంబరు 27 : జిల్లా వ్యాప్తంగా శనివారం జరగనున్న నులి పురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బీ.రవి పిలుపునిచ్చారు. క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను, సిబ్బంది పని తీరును, హాజరు పట్టిని పరిశీలించారు. తగినన్ని మందులు ఉన్నాయా? లేదా? కుటుంబ నియంత్రణ, శస్త్ర చికిత్సలు ఏ విధంగా జరుగుతున్నాయి? అనే దాని గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్రోసూరు పీహెచ్‌సీలో సిబ్బంది పని తీరును సమీక్షించారు. ఆయనతో పాటు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, సూపర్ వైజర్ శివుడు, పలువురు సిబ్బంది ఉన్నారు.

జీఆర్‌సీఆర్‌కే క్రీడాకారుల ఎంపిక

పెదకూరపాడు, సెప్టెంబరు 27 : నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అచ్చంపేట జెడ్పీ స్కూల్‌లో జరిగిన క్రీడా పోటీల్లో పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, షటిల్ క్రీడా పోటీల్లో విజయం సాధించినట్టు చైతన్య స్కూల్ నిర్వాకులు గుత్తా కవితా రాము శుక్రవారం తెలిపారు. వాలీబాల్ అండర్-17 బాలుర విభాగంలో అండర్-14 విభాగంలో బాలికలు ప్రథమ స్థాయిలో విజయం సాధించారు. కబడ్డీ క్రీడలో అండర్-17 బాలికల జట్టు, అండర్-14లో బాలికల జట్టు, అండర్-17, అండర్-14 బాలుర విభాగంలో సింగిల్స్‌ను, డబుల్స్‌ను కైవసం చేసుకున్నారు. షటిల్ అండర్-17 బాలుర, అండర్-14 బాలికల విభాగంలో ప్రథమ స్థానం పొంది నియోజకవర్గ జట్టుకు ఎంపికయ్యారు.

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

పెదకూరపాడు, సెప్టెంబరు 27 : స్థానిక ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో కాకతీయ విద్యా సంస్థల ప్రాంగణంలో వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. విజేతలైన వారికి ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందించనున్నట్టు జన చైతన్య సమితి కార్యదర్శి స్టాలిన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ అనీల్ కుమార్, కాకతీయ విద్యా సంస్థల కరస్పాండెంటెంట్, కార్యదర్శి బీవీ లలిత బాబు, ప్రిన్సిపల్ అశోక్, కరీం పాల్గొన్నారు.

రూ.4 లక్షల చెక్కు అందజేత



సీఎం చంద్రబాబుతో రమేష్

సత్తెనపల్లి, సెప్టెంబరు 27 : వరద బాధితుల సహాయార్థం సత్తెనపల్లి ఎల్‌ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు కలసి వసూలు చేసిన నాలుగు లక్షల రూపాయల విరాళాల చెక్కును శుక్రవారం మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసి సత్తెనపల్లి ఎల్‌ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచాల రమేష్ అందించారు.

వేంకటేశ్వరస్వామిని అవమానపరచిన జగన్

సత్తెనపల్లి, సెప్టెంబరు 27 : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తిరుపతి వేంకటేశ్వరస్వామిని అవమానపరిచారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వేంకటేశ్వరస్వామిపై నమ్మకం ఉందని జగన్ డిక్లరేషన్ ఫారంపై సంతకం చేయాలన్నారు. సంతకం చేయకుంటే స్వామి వారిని అవమానించటమేనన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించారన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై విచారణ జరిపి కారకులను శిక్షించాలన్నారు.

నూతన కోర్టు భవనాలు నిర్మించాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 27 : సత్తెనపల్లి పట్టణంలో ఉన్న పాత కోర్టుల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, కొన్ని మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్నాయని, వీటన్నింటికీ కలిపి ఒకే చోట నూతన కోర్టు భవనాలు నిర్మించాలని ఇండియన్ అసోసియేన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిచేటి వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో ఉన్నతాధికారులను కోరారు. కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయవాది గుమస్తాలు, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం తక్షణమే అన్ని కోర్టులు ఒకే చోట ఉండేలా నూతన కోర్టు భవనాలు నిర్మించాలన్నారు. పాత కోర్టు స్థానంలోనే నూతన కోర్టు కాంప్లెక్స్ నిర్మించటానికి, విస్తరించటానికి తగిన స్థలం అందుబాటులో ఉందని, వీటి నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ కూడా కృషి చేయాలని కోరారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 27 : కేంద్ర ప్రభుత్వం న్యాయవాదులపై ఉక్కుపాదం మోపేందుకు కుట్ర పన్ని ప్రత్యేక చట్టాలు తీసుకువస్తుందని నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. న్యాయవాదులను ఇబ్బంది పెట్టే చట్టాలను రూపొందించటం తగదని సీనియర్ న్యాయవాదులు పూజల వెంకట కోటయ్య, నరిచేటి వేణుగోపాల్ అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కే.అనీల్ కుమార్, జీ.రవి, వెంకటేశ్వరరావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈ క్రాపు నమోదుకు 30 వరకు గడువు పెంపు

నకరికల్లు, సెప్టెంబరు 27 : రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసుకున్న పంటల నమోదుకు ఈనెల 30వరకు గడువును పొడిగించినట్టు వ్యవసాయ అధికారి కే దేవదాసు తెలిపారు. రైతులు ఈ పంట నమోదు, ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని కోరారు.

మొబైల్ సిగ్నల్ టవర్‌లో రాగి తీగ చోరీ

ముప్పాళ్ళ, సెప్టెంబరు 27 : మండలంలోని నార్నెపూడిలో ఉన్న మొబైల్ సిగ్నల్ టవర్‌లోని రాగి తీగను శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. టవర్ పరిధిలోని వినియోగదారులకు సిగ్నల్ రాకపోవటంతో పల్నాడు జిల్లా మొబైల్ సిగ్నల్ టవర్ల ఇన్‌చార్జ్ ప్రవీణ్ కుమార్ టవర్‌ను పరిశీలించి చోరీకి గురైనట్టు గుర్తించి ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొత్తం 162 మీటర్ల రాగి తీగ చోరీకి గురైందని, దాని ఖరీదు రూ.40 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపారు.



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

ఆహ్లాదాన్ని విజ్ఞానాన్ని పెంచేవిగా పర్యాటక కేంద్రాలు : ఆర్డీవో

అమరావతి, సెప్టెంబరు 27: విద్యార్థులకు ఆహ్లాదాన్ని విజ్ఞానాన్ని పెంచేవిధంగా పర్యాటక కేంద్రాలు ఉపయోగపడుతున్నాయని సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. ప్రపంచపర్యాటక దినోత్సవం, స్వచ్ఛతాహీ సేవ సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు, మహిళా సంఘాలు, వైద్యసిబ్బంది, అంగనవాడీ సిబ్బందితో స్వచ్ఛతాహీ సేవ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని జరిగిన సమావేశంలో ప్రసంగించారు. పర్యటక కేంద్రాల అభివృద్ధి, సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, మండల ప్రత్యేక అధికారి రాజగోపాల్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాయుడమ్మ, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో పార్వతి, ఎంఈవో శివబాబు, సర్పంచ్ రాజేశ్వరి, మణికుమార్, రామాంజనేయులు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

క్రోసూరు, సెప్టెంబరు 27 : క్రోసూరుకు చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త కొల్లిపర్ల సుబ్బారావు మృతికి స్థానిక టీడీపీ నాయకులు శుక్రవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సుబ్బారావు పార్టీకి బలమైన కార్యకర్తగా ఉన్నారని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ ఫోన్ ద్వారా సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, పార్టీ నాయకులు మన్నెం శ్రీను, ఎన్.కోటేశ్వరరావు, దుద్దుల యోహాన్, రామాంజనేయలు, కె.శ్రీను, పూర్ణయ్య, ఆది శ్రీను, కె.సాంబయ్యలు సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పెదకూరపాడు ఎస్‌ఐగా గిరిబాబు



ఎస్‌ఐ గిరిబాబు

పెదకూరపాడు, సెప్టెంబరు 27 : పెదకూరపాడు ఎస్‌ఐగా గిరిబాబు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా కొండెపి ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీ పై పెదకూరపాడుకు వచ్చారు.

ఎమ్మెల్యే యరపతినేనిని కలిసిన జడ్పీ సీఈఓ



గుంటూరు సిటీ, సెప్టెంబర్ 27 : గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును జిల్లా పరిషత్ సీఈఓ వి.జ్యోతి బసు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్ళిన జడ్పీ సీఈఓ జ్యోతి బసు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తాజా బదిలీల వ్యవహారం చర్చకు వచ్చినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే యరపతినేనికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ సీఈవో

కేశానుపల్లిలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు

దాచేపల్లి, సెప్టెంబరు 27: దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామంలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. శుక్రవారం గ్రామంలో రూ.2 కోట్లతో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కోటి 40 లక్షల రూపాయలతో 90 వేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ నిర్మాణం, వాటర్ పైపులైన్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ.20 లక్షలు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంజూరు చేశారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నూతనంగా మరో నలుగురు ఉపాధ్యాయులను 7 నుంచి 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేస్తూ అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరి రామకోటయ్య, మాజీ ఎంపీటీసీ నెల్లూరి కోటయ్య, సర్పంచ్ ప్రసాదరావు, కోట శాయన్న, జనసేన నాయకులు కోట మధు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొల్లా కిట్టారావు, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, నెల్లూరి జానయ్య తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దాచేపల్లి, సెప్టెంబరు 27 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని దాచేపల్లి ఎంపీపీ కందుల జాన్ అధికారులను కోరారు. మండల పరిషత్ మీటింగ్ హాలులో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ కందుల జాన్ అధ్యక్షత వహించారు. మండల పరిధిలో తాగునీటి అవసరాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం, డ్రైనేజి వ్యవస్థ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ నాగెండ్ల రత్నం, సూపరింటెండెంట్ సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కందుల జాన్

తిరుమల లడ్డూపై భక్తులకు భరోసా ఇవ్వాలి



రిలేనిరాహారదీక్ష చేస్తున్న బాలగంగాధరరెడ్డి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 27 : తిరుమల లడ్డూ కల్తీ ఆవు నెయ్యితో తయారు చేయడం వివాదాస్పదమైన నేపథ్యంలో పిడుగురాళ్లకు చెందిన సామాజిక కార్యకర్త ముత్యం బాల గంగాధరరెడ్డి పిడుగురాళ్ల ఆర్అండ్‌బి బంగ్లా వద్ద 11 రోజుల రిలే నిరాహారదీక్ష శుక్రవారం ప్రారంభించారు. టీటీడీలోనే గోశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రపంచంలోని కోట్లాది మంది భక్తుల మనోభావాలకు తిరుమల పవిత్రత, ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న వ్యవహారంపై స్వచ్ఛమైన నెయ్యితో లడ్డును తయారు చేయండి.. భక్తులకు భరోసా ఇవ్వండి పాలకులారా అంటూ ముత్యం బాలగంగాధరరెడ్డి రిలేనిరాహారదీక్షకు కూర్చున్నారు.

రైతుల భూముల్లో పరిహారం కోసం కొలతలు తీసిన అధికారులు

● పొందుగుల ఓడరేవు రహదారి విస్తరణకు వడి వడిగా అడుగులు

నకరికల్లు, సెప్టెంబరు 27 : పొందుగుల-ఓడరేవు జాతీయ రహదారి 167ఏ విస్తరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. శుక్రవారం దేచవరం, రూపెనగుంట్ల, చల్లగుండ్ల గ్రామాల్లోని భూమిని కోల్పోతున్న రైతుల పొలాల్లో ఉన్న నిర్మాణాలు, బోరు బావులు, ఉద్యాన పంటలు, ప్రహరీ గోడల, భవనాల, షెడ్ల కొలతలను సేకరించారు. సంబంధిత శాఖలకు ఈ సమాచారాన్ని పంపి నష్టపరిహారం అంచనాను వేసేందుకు తగు నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు మండల సర్వేయర్ వీరయ్య తెలిపారు. ఓడరేవు నుంచి నకరికల్లు సమీపానికి 85 కిలో మీటర్ల మేర ఈ రహదారి నిర్మాణం జరగనున్నట్టు ఆర్అండ్‌బీ ఈఈ కే.చంద్రశేఖరరావు తెలిపారు.

కేసులున్న వారు వాయిదాలకు తప్పనిసరిగా వెళ్ళాలి : ఎస్‌ఐ

మాచవరం, సెప్టెంబరు 27 : వివిధ రకాల కేసుల్లో పేర్లు నమోదై ఉండి వాయిదాలకు వెళ్ళని వారు తప్పనిసరిగా వెళ్ళాలని ఎస్‌ఐ సతీష్ శుక్రవారం తెలిపారు. గతంలో గోవిందాపురం గ్రామానికి చెందిన తలారీ పెద సైదయ్య, కొత్తపాలెం గ్రామానికి చెందిన తాలే శ్రీకాంత్, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బొజ్జా నీలాంబరం అనే వ్యక్తులు కోర్టుల్లో కేసులు ఉన్నప్పటికీ వాయిదాలకు వెళ్ళకపోవటంతో వారిపై ఆయా కోర్టులు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాయన్నారు. దీనిలో భాగంగా వారిని తిరిగి అదుపులోకి తీసుకొని ఆయా కోర్టుల్లో హాజరుపరచగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ముప్పాళ్ళ, సెప్టెంబరు 27 : మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో డీబీఆర్‌సీ ఏరియా కో-ఆర్డినేటర్ మేడే వెంకట రమణ అధ్యక్షతన మహిళల రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సదస్సులో చిన్నప్ప బాల్య వివాహాలు, మహిళల అక్రమ రవాణా చట్టం, పని ప్రదేశంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గృహ హింస, ఎస్సీ, ఎస్టీ అత్యా చార చట్టాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి మహిళలకు పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది, వెలుగు ఏపీఎం బాలస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు

రాజుపాలెం,సెప్టెంబరు27:స్వర్ణాంధ్ర. 2047 కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాస రచన, డిబేట్ పోటీలను నిర్వహించారు. ఎంఈవో మల్లిఖర్జున శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలలో మండల పరిధిలో ఉన్న ఆరు జిల్లా పరిషత్ హైస్కూల్స్ చెందిన మొత్తం 36 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డిబేట్ పోటీలలో ఇనిమెట్ల పాఠశాలకు చెందిన వై.లక్ష్మీకుమారి మొదటి, రెండవస్థానంలో రాజుపాలెం పాఠశాలకు చెందిన ఎన్.నవ్య, మూడవ స్థానంలో ఆకులగణపవరం పాఠశాలకు చెందిన కె.యశ్వంతి నిలిచారు. వ్యాస రచన పోటీలలో ఆకులగణపవరం పాఠశాలకు చెందిన ఎం.హరిణి ప్రథమ, కె.సంజన ద్వితీయ, హసిని తృతీయస్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

పెదకూరపాడు, సెప్టెంబరు 27 : అక్షర యోధుడు గుర్రం జాషువా అని మండల చర్మ కారుల సంఘం అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు అన్నారు. పెదకూరపాడులో నవయుగ కవి చక్రవర్తి గుర్రం 129వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చర్మకారుల సేవా సంఘం నేతలు గార్లపాటి దాసు, చిలకా భాస్కరరావు, కొదముల బ్రహ్మం, టీ.చింతయ్య, బంకా కోటేశ్వరరావు, పోలు పాల్గొన్నారు.

● క్రోసూరులోని సీపీఎం కార్యాలయం ఆమంచి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం గుర్రం జాషువా జయంతి ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, మండల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు గోళ్ళ నరసింహారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు చిలక ఏసయ్య, కె.మల్లికార్జునరావు, మహిళా సంఘం నాయకురాలు అనూష, కేవీపీఎస్ నాయకులు గోపాలకృష్ణారెడ్డి, తంగెళ్ళ నరసింహారావు, ఆమంచి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ తమ్మిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నరసరావుపేట ఆర్డీవోగా మధులత

నరసరావుపేట, సెప్టెంబరు 27: నరసరావుపేట ఆర్డీవోగా డిప్యూటీ కలెక్టర్ కె మధులత నియమితుయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పనిచేస్తున్న పీ సరోజకు ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు. జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

కోటప్పకొండ ఏసీగా చంద్రశేఖరరావు బాధ్యతల స్వీకారం

నరసరావుపేట, సెప్టెంబరు 27: కోటప్పకొండ ఏసీగా దాసరి చంద్రశేఖరరావు నియమితులయ్యారు. అయన శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కార్యాలయ సిబ్బంది అయనకు అభినందనలు తెలిపారు.

నరసరావుపేట ఎంపీడీవోగా కృష్ణకుమారి ...

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27: నరసరావుపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టీవీ కృష్ణకుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని ఎంపీడీవో కృష్ణకుమారి దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ పి.అరుణ్‌బాబును ఎంపీడీవో కృష్ణకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.



ఓటింగ్ యంత్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

ఓటింగ్ యంత్రాల తనిఖీ

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 27: కలెక్టర్ పి.అరుణ్ బాబు శుక్రవారం మార్కెట్ యార్డులో భద్రపరచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓటింగ్ యంత్రాలను ఉంచిన గోదాము షటర్ల తాళాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరచి అక్కడ భద్రపరచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు పరిశీలించారు. తనిఖీలో కలెక్టర్ వెంట ఈవీఎం గోదాముల నోడల్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం వివిధ పార్టీల అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

5కే వాక్‌ను జయప్రదం చేయండి: కలెక్టర్

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 27 : పట్టణంలోని మహాత్మా గాంధీ వైద్యశాల ఆధ్వర్యంలో ఈ నెల 29న వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 29న డాక్టర్ కోడెల శివప్రసాదరావు మున్సిపల్ స్టేడియంలో హృదయ సంబంధ వ్యాధులపై అవగాహన కోసం 5కే వాక్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీ ప్రభుత్వం

● రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 27: తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని వైసీపీ ప్రభుత్వం మొత్తం అవినీతిమయం చేసిందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం ధారునాయక్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు బ్రోకర్లుగా వ్యవహరించి తిరుమల వెంకటేశ్వరస్వామిని అపవిత్రం చేశారన్నారు. కరుణాకర్ రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వైసీ సుబ్బారెడ్డి హిందువులా అని ప్రశ్నించారు. వాళ్ళు డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. ఏనాడైనా జగన్‌మోహన్‌రెడ్డి సతీసమేతంగా తిరుపతికి వచ్చారా అని ప్రశ్నించారు. లంబాడి, సుగాలి, బంజారా ఆరాధ్యదైవం హాథీరామ్ ట్రస్ట్ అన్నారు. హాథీరామ్ ట్రస్ట్ భూములను వైసీపీ నాయకులు కబ్జా చేశారన్నారు. వైసీపీ నాయకులు తిరుపతికి ఇచ్చే లేఖలను కూడా అమ్ముకున్నారని ఆరోపించారు. హాథీరామ్ ట్రస్ట్ భూములపై ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చామని, దుర్మార్గమైన వైసీపీ నాయకులను శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ నాయక్, కార్యనిర్వాహక కార్యదర్శి బాలజీ నాయక్, ఉపాధ్యక్షుడు విజయనాయక్ తదితరులు, గొట్టిపాటి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 27: స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతోంది

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, విజయకుమార్ తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 27: రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కాకాని చెందిన సుబ్బారావుకు రూ.62,519లు, పెట్లూరివారిపాలెంకు చెందిన సుంకర సీతామహాలక్ష్మికి రూ.81,000లు, రావిపాడుకు చెందిన కర్నా కోటిరత్నంకు రూ .1,50,000లు, నరసరావుపేటకు యదనపల్లి మేరీభారతి రూ.1,50,000లు, శివకుమారికి రూ.82095లు, దండా శ్రీకాంత్‌కు రూ.65786లు చెక్కులను అందజేశారు. మొత్తం రూ.5,91,400 లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, టీడీపీ రొంపిచర్ల మండలం అధ్యక్షుడు పులుకూరి జగ్గయ్య, సురేష్, కాశిమ్, శాఖమూరి రామూర్తి, బండారుపల్లి విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ రామశాస్త్రి తదితరులు

సహకార సంఘాలకు రిటర్న్స్ ఫైలింగ్‌పై అవగాహన

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 27: సహకార సంఘాలకు ఆదాయపన్ను రాయితీ రావాలంటే నిర్ణీత గడువులోగా రిటర్న్స్ ఫైల్ చేయాలని ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ ఎం.రామశాస్త్రి తెలిపారు. శుక్రవారం నరసరావుపేటలోని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ శాఖలో పల్నాడు జిల్లాలోని 59 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వారికి ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ ఫైలింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎం రామశాస్త్రి మాట్లాడుతూ ఆదాయపు పన్నుశాఖ కార్యాలయం నుంచి వచ్చిన తాఖీదులకు వెంటనే స్పందించి బదులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి ఎం వెంకటరమణ, జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి డీ శ్రీనివాసరావు, ఆదాయపన్ను శాఖ సూపరింటెండ్ ఎస్‌కే అమానుల్లా, నరసరావుపేట జీడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎస్ రమాదేవి, జిల్లాలోని సహకార సంఘాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌లను సద్వినియోగం చేసుకోవాలి

● నర్సరావుపేట పార్లమెంట్ సభ్యుడు శ్రీకృష్ణదేవరాయలు



కనమర్లపూడిలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

శావల్యాపురం, సెప్టెంబరు 27: వాటర్‌ప్లాంట్‌ల నిర్వహణలో ప్రజలంతా భాగస్వాములై సద్వినియోగం చేసుకోవాలని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు. ఇరిడా సంస్థవారి ఆర్థిక సహకారంతో బాలవికాస సేవాసంస్థ ఆధ్వర్యంలో ఎంపీ నిధులతో మండలంలోని కనమర్లపూడి, ముండ్రువారిపాలెం గ్రామాల్లో నిర్మించి మినరల్ వాటర్‌ప్లాంట్‌లను ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికారున్జరావులు శుక్రవారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ పల్నాడు జిల్లా పరిధిలో మొత్తం 60వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేయగా వాటిలో వినుకొండ నియోజకవర్గంలో 12వాటర్‌ప్లాంట్‌లు పూర్తిచేశామని, మరో 11వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ బాలవికాస సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, భవిష్యత్తులో బాలవికాస, శివశక్తి ఫౌండేషన్‌లు సంయుక్తంగా పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించే పథకాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరీరెడ్డి, వాటర్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ మధుసూధన్‌రెడ్డి, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ అబ్బులు, ఫీల్డ్ కో ఆర్డినేటర్ రాజు, టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, జనసేన జిల్లా కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు, సీనియర్ నేతలు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, బొల్లా పేరయ్య, ఒత్తుల వెంకటేశ్వర్లు, బోడపూడి శంకర్, కాసరగడ్డ వెంకటరత్నం, పూరేటి నరసింహారావు, మాజీ సర్పంచ్ తన్నీరు అంకారావు పాల్గొన్నారు.

దీక్షలకు ఎంపీ లావు, ఎమ్మెల్యే జీవీ సంఘీభావం



హోమంలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన, గాదె, నాగశ్రీను తదితరులు

వినుకొండ, సెప్టెంబరు 27: చేసిన మోసాలకు అన్ని మతాలవారికి జగన్ క్షమాపణ చెప్పాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డూలో కల్తీనెయ్యి వాడకం నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా వినుకొండలో జనసేన సమన్వయకర్త నాగశ్రీను రాయల్ ఏడు రోజులు దీక్షను చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో మహాహోమం చేపట్టారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావులు పాల్గొని మహాహోమం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో జరిగిన తప్పులు, అపచారాలు, విగ్రహాలపై దాడులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్‌గా చేసిన సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి తిరుమల ప్రతిష్టను మంటగలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

నవరాత్రులకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

వినుకొండ టౌన్, సెప్టెంబరు 27: ఈ నెల 3 తేదీ నుంచి మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని షిరిడీసాయి బాబా ఆవరణలో హిమాలయ గురువు ఆధ్వర్యంలో జరిగే శ్రీదేవి నవరాత్రులకు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులను హిమాలయ గురువులు ఆయన నివాసంలో కలిసి గురువారం ఆహ్వాన పత్రికను అందచేశారు.

వార్డుల్లో పనులు జరగటం లేదని కౌన్సిలర్ల గగ్గోలు

● కౌన్సిల్ సమావేశంలో 30 అంశాలకు ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ డాక్టర్ దస్తగిరి, సమస్యలపై మాట్లాడుతున్న 7వ వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ

వినుకొండ టౌన్, సెప్టెంబరు 27: వార్డుల్లో పనులు జరగక పోవడంతో ప్రజలు మాపై తిరగబడుతున్నారు, చిన్న చిన్న సమస్యలు పరిష్కరించి, వార్డుల్లో పరువు కాపాడాలని వైసీపీ వార్డు కౌన్సిలర్లు చైర్మన్ దస్తగిరి వద్ద వాపోయారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఎజెండాలోని 30అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం వార్డుల్లోని సమస్యలపై కౌన్సిలర్లు జయరావు, భాష, మార్కెట్ నన్నేషా, వైస్‌చైర్మన్ గాబ్రియల్, ఎంఎల్‌రెడ్డిలు లేచి వార్డుల్లో పనులు జరగకపోవడంపై చైర్మన్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గతంలో మున్సిపల్ నిధులు దుర్వినియోగం అయ్యాయని, నేడు రూ.ఆరు కోట్లు అప్పులు ఉన్నాయన్నారు. నేను గతంలో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ కౌన్సిలర్లు సొంత నిధులతో పనులు చేసుకుంటామని చెబితే, ఎజెండాలో పెట్టామని తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు చేయడంలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రశ్నించలేని వారు, ఇప్పుడు ఎందుకు ప్రశ్నిస్తున్నారని టీడీపీ 32వ వార్డు కౌన్సిలర్ లింగమూర్తి వైసీపీ కౌన్సిలర్లను నిలదీశారు. నరగాయకట్ట వద్ద బీఫ్ సెల్లింగ్ సెంటర్ ఏర్పాటు చేయడాన్ని 7 వార్డు కౌన్సిలర్ రెడ్డినాగపద్మ తీవ్రంగా వ్యతిరేకించారు. మరో ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు అధికారుల స్థలం ఏర్పాటు చేయాలని చైర్మన్ సూచించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27: మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోగల లలితదేవి కాలనీలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై నరసరావుపేట రూరల్ పోలీసులు శుక్రవారం దాడిచేశారు. ఈ దాడిలో నిర్వాహకుడు మస్తాన్‌వలితో పాటుగా ఇద్దరు యువతులు, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా తమ్మాజీ



నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 27: పల్నాడు జిల్లా నూతన నైపుణ్యాభివృద్ధి అధికారిగా ఈ.తమ్మాజీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా బాపట్ల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఆయన పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన కె.సంజీవరావు గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

నేడు ఎస్సీ, ఎస్టీ ప్రజా సమస్యల ప్రత్యేక పరిష్కార వేదిక

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 27: పల్నాడు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ప్రజల సమస్యల కోసం నేడు ప్రత్యేక పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. ఇక నుంచి ప్రతి నెల నాలుగో శనివారం కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలకు ఈ వేదికను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలు ఈ పరిష్కార వేదికను వినియోగించుకోవాలని అయన కోరారు.

ఎన్ఈసీ ఫార్మా కళాశాలలో హెచ్ఐవీపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 27 : మండలంలో ఎన్ఈసీ ఫార్మా కళాశాలలో శుక్రవారం హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం చుట్టూ జరిగే విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ లాజరస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ స్థితిని తెలుసుకుని ఉండాలన్నారు. హ్యాండ్సాఫ్ కమ్ ఫ్యాషన్ నిర్వాహకులు ఆనంద్ బెంజిమెన్ ట్రాఫికింగ్, మాదకద్రవ్యాలతో, విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు.

రేపు గోపాలంవారిపాలెంలో మెగా వైద్య శిబిరం

చిలకలూరిపేట, సెప్టెంబరు 27: చిలకలూరిపేట మండలం గోపాలంవారిపాలెంలో నరసరావుపేట తేజ నర్సింగ్ హోమ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో వైద్యులు బొట్ల రఘుప్రసాద్, బొట్ల పార్వతి, బొట్ల రంగతేజ, కర్నాటి శ్రావణి పాల్గొని వైద్య సేవలను అందించి రోగులకు అవసరమైన మందులు కూడా పంపిణీ చేస్తారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తేజ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ బొట్ల రఘుప్రసాద్ కోరారు.

నేడు నాదెండ్లలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, సెప్టెంబరు 27: మండల కేంద్రమైన నాదెండ్లలో శనివారం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. నాదెండ్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయం, చిరుమామిళ్ళ సెక్టార్, ఎస్సీ కాలనీ, గ్రామంలోని పరిశ్రమల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు.

కోరం లేక సమావేశం రద్దు

రొంపిచర్ల, సెప్టెంబరు 27 : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక రద్దయింది. మండలంలో 18మంది ఎంపీటీసీలు, ఒక కో-ఆప్షన్ సభ్యులు ఉన్నారు. సమావేశం జరగాలంటే 1/3వ వంతు సభ్యులు హాజరు కావాల్సి ఉంది. ఐతే ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ, బుచ్చిపాపన్నపాలెం ఎంపీటీసీ చల్లా తిరుపతిరావులు హాజరయ్యారు. సమావేశం జరగాలంటే ఆరుగురు సభ్యులు హాజరు కావాల్సి ఉంది. దీంతో సమావేశం రద్దయినట్టు ఎంపీడీవో కే మాథ్యూబాబు ప్రకటించారు. రొంపిచర్ల మండలంలో సర్వసభ్య సమావేశం కోరం లేక రద్దవ్వటం ఇదే ప్రథమం. ఎంపీటీసీలందరూ వైసీపీకి చెందిన వారే. సర్పంచ్‌లు కూడా హాజరు కాలేదు. అధికారులు వచ్చి వెనుదిరిగి వెళ్ళారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, సెప్టెంబరు 27: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి సాయంత్రం 4 గంటలైనా ప్రారంభం కాలేదు. మండలంలో మొత్తం 18 మంది ఎంపీటీసీలు, ఒక కో-ఆప్షన్ సభ్యులు ఉన్నారు. ఎంపీపీ గడ్డం బాలనాగమ్మ మినహా సమావేశానికి ఎవ్వరూ హాజరు కాలేదు.

కవి గుర్రం జాషువా గృహ సందర్శన యాత్ర

వినుకొండ, సెప్టెంబరు 27: కవి కోకిల గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా శనివారం వినుకొండ సమీపంలోని చాట్రగడ్డపాడులోని అయన గృహ సందర్శన యాత్ర చేపట్టనున్నట్లు రచయితల సంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు కే.జె రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలోని కవులు, కళాకారులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ శివకుమారి

మేలైన యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

నాదెండ్ల, సెప్టెంబరు 27: మేలైన యాజమాన్య పద్ధతులు అనుసరించటం ద్వారానే రైతులు అధిక దిగుబడులు సాధించగలుగుతారని జిల్లా వనరుల కేంద్రం కో-ఆర్డినేటర్ ఎం.శివకుమారి అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్లలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన - రాస్తార్ పథకం కింద రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ రైతులు మిరపపైరులో కాంప్లెక్స్ ఎరువులను నెల రోజుల లోపల మాత్రమే వాడుకోవాలన్నారు. రసాయన ఎరువుల కన్నా సేంద్రీయ, జీవన ఎరువులు వాడకం పైర్లకు మేలు చేస్తాయన్నారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ క్రిమి సంహారక మందులతో వేప సంబంధిత మందులు కలిపి వాడకూడదన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాదు, సహాయకులు అనుపమ, వేదవతి, రైతులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన



చేతుల శుభ్రంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

నాదెండ్ల, సెప్టెంబరు 27: ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రం చేసుకోవటం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే పద్మ అన్నారు. నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా చిరుమామిళ్ళలో చేతులు శుభ్రం చేసుకొనే పద్ధతుల గురించి తల్లిదండ్రులకు, కిషోర బాలికలకు, చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతులు శుభ్రం చేసుకోకపోవటం వల్ల సూక్ష్మ క్రిములు కడుపులోకి వెళ్ళి పలు వ్యాధులకు కారణమవుతాయన్నారు. మరుగుదొడ్డిని ఉపయోగించినప్పుడు, మల మూత్రాలు విసర్జించినప్పుడు, భోజనం వండటానికి ముందు, తినటానికి ముందు ఐదు దశల్లో చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులను శుభ్రం చేసుకొనే పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కే అనూషా, గోవర్దన లక్ష్మి, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువను పునరుద్ధరించాలి

● ఎంపీ, ఎమ్మెల్యేలకు శావల్యాపురం రైతుల వినతి

శావల్యాపురం, సెప్టెంబరు 27: పూడిపోయిన పంట కాలువను పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందించాలని శావల్యాపురానికి చెందిన రైతులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో శుక్రవారం మొరపెట్టుకొన్నారు. మినరల్ వాటర్‌ప్లాంట్‌ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలతో రైతులు మాట్లాడుతూ గుంటూరు-గుంతకల్ రైల్వేమార్గంలో నిర్వహిస్తున్న డబ్లింగ్ పనుల వల్ల పంట కాలువ పూడిపోయి 500ఎకరాలకు సాగునీటి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలువ నిర్మాణానికి భూమిని ఇచ్చేందుకు రైతులంతా సిద్ధంగా ఉన్నారని, సిమెంట్‌తో లైనింగ్‌కాలువ ఏర్పాటుచేస్తే భవిష్యత్తులో పూడిపోకుండా సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ అధికారులతో కాలువ నిర్మాణానికి అంచనాలు వేయిస్తే వెంటనే నిధులు కేటాయిస్తామన్నారు. శావల్యాపురం రైల్వేస్టేషన్‌లో ఒక్క రైలు మాత్రమే ఆగుతుందని, మరికొన్ని రైళ్ళు ఆగేలా కృషి చేయాలని, రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఎంపీ దృష్టికి తీసుకెళ్ళగా త్వరలో విజయవాడ నుంచి బెంగుళూరుకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని, దాన్ని శావల్యాపురంలో ఆగేందుకు కృషి చేస్తానని, ఆర్‌యూబీ నిర్మాణంపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. గ్రామపార్టీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, గ్రామపెద్దలు కామినేని లక్ష్మీనారాయణ, కర్రి పెదఅంజయ్య, పాలడుగు సత్యనారాయణ, చెరుకూరి చౌదరి, చెవల వెంకటకృష్ణయ్య, కాకాని వేణు, అంబటి అయ్యన్న, చెరుకూరి రామాంజనేయులు, మర్రి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని చిన్నకంచెర్ల వాసుల వినతి

శావల్యాపురం, సెప్టెంబరు 27: మండలంలోని చిన్నకంచెర్లలోని సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులను కోరారు. శుక్రవారం వాటర్‌ప్లాంట్‌ల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలను మార్గమధ్యలో కలిసిన చిన్నకంచెర్ల గ్రామస్థులు పొలాలకు వెళ్ళే రోడ్లకు ఐదేళ్ళుగా మరమ్మతులు చేయకపోవడంతో అవి అధ్వానంగా మారాయని, పిట్టంబండకు వెళ్ళే మార్గం గుంతలమయంగా మారిందని తెలుపగా ఎంపీ మట్టిరోడ్లకు మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. శానంపూడి ఎస్సీకాలనీలో ప్రార్ధనా మందిరం, ముండ్రువారిపాలెం ఎస్సీకాలనీలోని శ్మశానవాటికను ఎంపీ, ఎమ్మెల్యేలు పరిశీలించారు.

పేదల కోసం పాటుపడే వ్యక్తి సీఎం చంద్రబాబు

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

రొంపిచర్ల, సెప్టెంబరు 27: పేద ప్రజల కోసం పాటు పడే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. మండలంలోని అలవాల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి గురువారం రాత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్‌డీఏ ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. వంద రోజుల్లో వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసం సృష్టిస్తే కూటమి ప్రభుత్వం పేద ప్రజల కోసం పాటు పడిందన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, పల్లెల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్

రైతులతో జాయింట్ కలెక్టర్ సమావేశం

రొంపిచర్ల, సెప్టెంబరు 27: మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ శుక్రవారం రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. చీరాల ఓడరేవు పిడుగురాళ్ళ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. మాచవరంలో 77సెంట్లు, విప్పర్లలో 1.88 ఎకరాలు విస్తరణ పనుల్లో రహదారి కోసం సేకరించనున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నగదు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని, తహసీల్దార్ బండి నిర్మల పాల్గొన్నారు.

ఎరువుల కొరతతో అన్నదాతల్లో ఆందోళన

ఈపూరు, సెప్టెంబరు 27: నాగార్జున సాగర్ కుడిప్రధాన కాలువ ఆయకట్టు పరిధిలో వరినాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. అయితే పంట పొలాలకు వేయాల్సిన ఎరువుల కొరత ఏర్పడడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కాంప్లెక్స్ ఎరువులతో పాటు డీఏపీ రైతులు పొలాలకు వేయాల్సి ఉంది. కాని డీఏపీ, యూరియా కొరతగా ఉంది. గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలు సకాలంలో రైతులకు ఎరువులను అందించలేకపోతున్నాయి. సకాలంలో పంటలకు ఎరువులు అందించలేకపోతే పైరు ఎదుగుదలలో తేడా వస్తుందనే భయంలో కర్షకులు ఉన్నారు. ఇదే అదునుగా ప్రవేటు ఎరువుల దుకాణాలలో డీఏపీ, యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి ఎరువులు సకాలంలో అందేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఉర్దూ స్కూలుకు ప్రింటర్ వితరణ

చిలకలూరిపేట, సెప్టెంబరు 27: ఇన్నర్ వీల్ క్లబ్ అఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో స్థానిక పసుమర్రు రోడ్డులో ఉన్న జీనత్ ఎడ్యుకేషన్ సెంటర్ ఉర్దూ స్కూలుకు రూ.12 వేల విలువగల జిరాక్స్ ప్రింటర్ అండ్ స్కాన్ మిషన్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. క్లబ్ సభ్యురాలు పంగులూరి ధనలక్ష్మి అందించిన ఆర్థిక సాయంతో దీనిని సమకూర్చారు. క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, స్కూలు ప్రిన్సిపాల్ ఖాలీద్ ఖాన్, స్కూలు కమిటి సెక్రటరీ రహమాన్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట దేవాలయాల ఈవోగా అశోక్ కుమార్ నియామకం

చిలకలూరిపేట, సెప్టెంబరు 27: చిలకలూరిపేట గ్రూపు దేవాలయాలు, పట్టణంలోని కొమరవల్లిపాడు గ్రూపు దేవాలయాలకు కార్యనిర్వహణాధికారిగా బి అశోక్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిలకలూరిపేట చెందినవాడు. గోవాడ శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవస్థానానికి కూడా ఆయన అదనపు బాధ్యతలు చేపట్టారు. 2009 నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆయన 11 చోట్ల వివిధ గ్రూపుల దేవస్థానాలకు ఈవోగా వ్యవహరించారు.

ఆర్యవైశ్య ప్రముఖుల కుటుంబాలకు ప్రత్తిపాటి పరామర్శ

చిలకలూరిపేట, సెప్టెంబరు 27: ఇటీవల మృతిచెందిన ఇద్దరు స్థానిక ఆర్యవైశ్య ప్రముఖుల గృహాలకు స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు వెళ్లి వారి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. స్థానిక వాసవి నగర్‌లోని రాచమల్లు శ్రీరామమూర్తి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 20వ వార్డులో రాచమల్లు కన్నారావు గృహాన్ని సందర్శించి కన్నారావు చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. వీరిద్దరూ పట్టణంలో పలు విద్యా సంస్థలు నిర్వహిస్తున్న చిలకలూరిపేట విద్యాసంఘం కమిటీ కార్యదర్శులుగా గతంలో వ్యవహరించారు. పుల్లారావు వెంట చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు, టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా, జనసేన నాయకులు తోట రాజారమేష్ ఉన్నారు.

చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో 15 మందికి కొత్తగా పోస్టింగ్

చిలకలూరిపేట, సెప్టెంబరు 27: చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌కు కొత్తగా 15 మంది సిబ్బంది రానున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కొత్తగా నియమితులైన వారిలో ఉన్నారు. వీరంతా ఒకటి రెండు రోజుల్లో ఇక్కడ చేరే అవకాశం ఉంది. కాగా ఈస్టేషన్ నుంచి నలుగురు వివిధ చోట్లకు బదిలీ అయ్యారు.

జల జీవన్ మిషన్ పనులను పరిశీలించిన ఈఈ విజయకుమార్

రొంపిచర్ల, సెప్టెంబరు 27: మండలంలోని రొంపిచర్ల, అన్నవరం గ్రామాల్లో జల జీవన్ మిషన్ ప్యాకేజీ పైపులైన్ పనులను ఈఈ విజయ కుమార్, డీఈ ఏడుకొండలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పైపుల నాణ్యతను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

రొంపిచర్ల చర్చిలో చోరీ

రొంపిచర్ల, సెప్టెంబరు 27: రొంపిచర్ల జడ్పీ పాఠశాల సమీపంలోని చర్చిలో గత రాత్రి చోరీ జరిగింది. చర్చిలోని సామగ్రిని దొంగిలించుకు వెళ్ళారు. ఈ మేరకు చర్చి ఫాదర్ రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

కాలువ కట్ట వద్ద సెల్ఫీపాయింట్

వినుకొండ, సెప్టెంబరు 27: మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో కాలవ కట్ట వద్ద సుందరీకరణ, సెల్ఫీపాయింట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.